RNI TEL TEL 2024/89323.

# జన సంఘర్షణ

మా లక్ష్యం సామాన్యుని పక్షం

తెలుగు దినపత్రిక

| నిజామాబాద్ | సంపుటి : 03 | సంచిక : 193 | ఆగస్టు 13 గురువారం 2026 | ఎడిటర్ : రాచమల్లు మాధవి | పేజీలు 08 | వెల : రూ. 6.00 |
|---|---|---|---|---|---|---|
| Nizamabad | Vol: 03 | Vol: 193 | August 13 Thursday2026 | Editor : rachamallu madhavi | Pages 08 | Cost: Rs 6.00 |


నీటివాటలపై రాజీ లేదు మంత్రి శ్రీధర్ బాబు 2

## తెలంగాణాకు మరిన్ని ఇండ్లను కేటాయించాలి

### రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

**న్యూఢిల్లీ జనసంఘర్షణ**

ప్రధానమంత్రి ఆవాస్ యోజన-గ్రామీణ్ పథకం కింద తెలంగాణ రాష్ట్రానికి ఒకేసారి 11,56,915 ఇళ్లను కేటాయించాలని తెలంగాణ రాష్ట్ర హౌసింగ్, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం న్యూఢిల్లీలో కేంద్ర వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌ను కలిసి ఆయన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గతంలో సీఎం రేవంత్‌రెడ్డి రాసిన లేఖను ప్రస్తావిస్తూ, రాష్ట్రంలో నిరుపేదల ఇళ్ల కేటాయింపు ప్రక్రియను వేగవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. 'ఆవాస్ ప్లస్-2024' యాప్ ద్వారా నిర్వహించిన పారదర్శక సర్వేలో 11.56 లక్షల కుటుంబాలు ఇళ్లకు అర్హులుగా తేలాయని, ఏడాది క్రితమే అనర్హుల తొలగింపు పూర్తయినా కేంద్రం నుంచి లక్ష్యాల ప్రకటన ఆలస్యమవుతోందని వివరించారు.



తెలంగాణలో ప్రతి పేద కుటుంబానికి రూ.5 లక్షల ఆర్థిక సాయంతో ఇల్లు నిర్మించి

➤ మిగతా 2వ పేజిలో..

## డిఫాల్ట్ రైస్ మిల్లర్ల నుంచి బకాయిలను వెంటనే వసూలు చేయాలి

### ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

**హైదరాబాద్ జనసంఘర్షణ**

తెలంగాణ పౌరసరఫరాల శాఖలో డిఫాల్ట్ అయిన రైస్ మిల్లర్ల నుంచి బకాయిలను వెంటనే వసూలు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఉద్దేశపూర్వకంగా బకాయిలు చెల్లించని మిల్లర్ల మిల్లులను స్వాధీనం చేసుకుని, వాటి నిర్వహణ బాధ్యతలను మహిళా సంఘాలకు అప్పగించే అవకాశాలను పరిశీలించాలని సూచించారు. మిల్లర్ల బ్లాక్‌మెయిల్‌ను ఎట్టిపరిస్థితుల్లో సహించేది లేదని హెచ్చరించిన సీఎం, బకాయిల రికవరీకి పక్కా విధానాన్ని రూపొందించి కేబినెట్ సబ్‌కమిటీలో చర్చించి నిర్ణయం తీసుకోవాలని దిశానిర్దేశం చేశారు. హైదరాబాద్‌లోని ఎంసీఆర్‌హెచ్‌ఆర్డీ ప్రాంగణంలో పౌరసరఫరాల శాఖపై బుధవారం నిర్వహించిన ఉన్నత స్థాయి సమీక్షలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, కార్పొరేషన్ ఛైర్మన్ స్టీఫెన్ రవీంద్ర, ఇతర అధికారులతో కలిసి సీఎం మాట్లాడారు. రాష్ట్రంలోని మార్కెట్ గోదాములను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని,



అవసరమైతే మిల్లింగ్ బాధ్యతలను కూడా మహిళా సమాఖ్యలకే అప్పగిస్తామని స్పష్టం చేశారు. ధాన్యం దిగుబడి ఎక్కువగా ఉండే ఐదు నియోజకవర్గాలను ఎంపిక చేసి, 50 నుంచి 100 ఎకరాల్లో ఉపాధి హామీ పథకం నిధులతో మహిళా సంఘాల ద్వారా గోదాముల నిర్మాణం కోసం పైలట్

➤ మిగతా 2వ పేజిలో..

## చర్చకు సిద్ధం: అమిత్ షా ప్రకటన



**న్యూఢిల్లీ జనసంఘర్షణ**

పార్లమెంట్‌లో ప్రతిపక్షాలు లేవనెత్తే ఏ అంశంపైనైనా చర్చించేందుకు తాను పూర్తి సిద్ధంగా ఉన్నానని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా స్పష్టం చేశారు. సభ సజావుగా సాగకుండా ప్రతిపక్షాలే పదేపదే ఆటంకాలు కలిగిస్తున్నాయని విమర్శించిన ఆయన, విపక్షాలు అడిగే ప్రతి ప్రశ్నకు సమాధానమిచ్చేందుకు సిద్ధమని తెలిపారు. బుధవారం న్యూఢిల్లీలోని పార్లమెంట్ ప్రాంగణంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ... సభలో చర్చ జరగాలా లేక ఆందోళనలు కొనసాగాలా అనేది ప్రతిపక్షాలే తేల్చుకోవాలని వ్యాఖ్యానించారు. చర్చకు సిద్ధంగా ఉన్న ఎంపీలు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు లేఖ రాస్తే వెంటనే చర్చ ప్రారంభించవచ్చని, అవసరమైతే వరుసగా 24 గంటల పాటు సభలో అందుబాటులో ఉండి సమాధానాలు ఇస్తానని చెప్పారు. ఈ సందర్భంగా ఢిల్లీలో విద్యార్థులపై లాఠీఛార్జ్ ఘటనపై చర్చకు రావాలని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీకి సవాల్ విసిరారు.అమిత్ షా వ్యాఖ్యలపై కాంగ్రెస్ ఎంపీ

➤ మిగతా 2వ పేజిలో..

## షార్ట్‌కట్స్ కోసం వెంపర్లాడొద్దు

**జెన్‌జీలకు పధానమంత్రి సూచన**

**న్యూఢిల్లీ జనసంఘర్షణ**

భవితలో విజయవంతం కావడానికి షార్ట్‌కట్ మార్గాల కోసం వెంపర్లాడితే తీవ్రంగా నష్టపోయే ప్రమాదముందని ప్రధాని నరేంద్ర మోదీ జెన్‌జీ యువతను హెచ్చరించారు. జీవితంలో స్థిరమైన ప్రగతిని సాధించేందుకు ఎల్లప్పుడూ అర్థవంతమైన, సరైన మార్గాలనే ఎంచుకోవాలని ఆయన హితవు పలికారు. మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ఆత్మకథా గ్రంథావిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా ప్రధాని ఈ ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేశారు. వేగంగా గమ్యాన్ని చేరుకోవాలనే తొందరలో కొందరు వ్యక్తులు ఫుట్ ఓవర్ బ్రిడ్జిలను ఉపయోగించకుండా రైల్వే ట్రాక్‌లను దాటుతుంటారని, అలాంటి ప్రమాదకర ధోరణుల పట్ల హెచ్చరిస్తూ రైల్వే స్టేషన్లలో పెట్టే బోర్డులు మన జీవితానికి కూడా ఎంతో ఉపయోగపడతాయని గుర్తుచేశారు. ఈ క్రమంలోనే సోషల్ మీడియా ప్రభావం, ఇన్‌ఫ్లుయెన్సర్లు, రీల్స్ సంస్కృతి పట్ల యువత జాగ్రత్తగా ఉండాలని సూచించారు. కేవలం రీల్స్‌కే పరిమితం కాకుండా కెరీర్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరారు. సమాజంలో ఉన్నత స్థానాలకు ఎదిగిన మహాత్ముల ఆత్మకథలను చదవడం ద్వారా ప్రేరణ పొంది, సరైన దిశలో ముందడుగు




వేయాలని పిలుపునిచ్చారు. కాగా, ఇటీవల ప్రధాని మోదీ కూడా జెన్‌జీకి మరింత చేరువయ్యేలా సోషల్ మీడియాలో వారి శైలిలోనే స్పందిస్తూ, ఇన్‌స్టాగ్రామ్ సెల్ఫీ వీడియోల ద్వారా సందేశాలు అందిస్తున్న విషయం తెలిసిందే. మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ బయోగ్రఫీ 'ట్రయంఫ్ ఆఫ్ ది ఇండియన్ రిపబ్లిక్: మై లైఫ్, మై స్ట్రగుల్స్' పుస్తకాన్ని ప్రధాని నరేంద్ర మోదీ బుధవారం న్యూఢిల్లీలో ఆవిష్కరించారు.

➤ మిగతా 2వ పేజిలో..

## పార్లమెంట్ వేదికగా ఎంపీ సుష్మితా దేవ్ తనను 'లుంగీవాలా'

**న్యూఢిల్లీ జనసంఘర్షణ**

పార్లమెంట్ వేదికగా ఎంపీ సుష్మితా దేవ్ తనను 'లుంగీవాలా' అని సంబోధిస్తూ అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారని సీపీఐ(ఎమ్) రాజ్యసభ ఎంపీ జాన్ బ్రిట్టాస్ ఆరోపించడంతో రాజ్యసభలో తీవ్ర కలకలం రేగింది. ఈ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తూ ఆమెపై బ్రిట్టాస్ ప్రివిలేజ్ మోషన్ ప్రవేశపెట్టారు. తాను మలయాళీగా, దక్షిణాది వ్యక్తిగా తన

➤ మిగతా 2వ పేజిలో..

## మళ్లీ పెరిగిన బంగారం ధరలు

**న్యూఢిల్లీ జనసంఘర్షణ**

దేశీయంగా బంగారం ధరలు గత రెండు రోజులుగా వరుసగా పెరుగుతూ వినియోగదారులకు, ముఖ్యంగా శ్రావణమాసం పండుగల వేళ



కొనుగోలుదారులకు ఆందోళన కలిగిస్తున్నాయి. బుధవారం నాటి బులియన్ మార్కెట్ ట్రేడింగ్‌లో 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారంపై రూ.1,040, 22 క్యారెట్ల బంగారంపై రూ.950, అలాగే 18 క్యారెట్ల బంగారంపై రూ.770 మేర ధరలు పెరిగాయి. గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ వివరాల ప్రకారం.. హైదరాబాద్ మార్కెట్‌లో

➤ మిగతా 2వ పేజిలో..

# తెలంగాణాకు మరిన్ని ఇండ్లను కేటాయించాలి

**మొదటి పేజీ తరువాయి..** ఇచ్చేందుకు నిధులను రాష్ట్ర బడ్జెట్‌లోనే కేటాయించినట్లు తెలిపారు. స్వయంగా తెలంగాణకు వచ్చి ఇళ్ల కేటాయింపును ప్రకటించాల్సిందిగా కేంద్రమంత్రిని ఆహ్వానించగా, శివరాజ్ సింగ్ చౌహాన్ సానుకూలంగా స్పందించారు. ఈ భేటీలో పలువురు ఎంపీలు, హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ వీ.పీ. గౌతమ్ పాల్గొన్నారు.

# పార్లమెంట్ వేదికగా ఎంపీ సుష్మితా దేవ్ తనను 'లుంగీవాలా'

**మొదటి పేజీ తరువాయి..** సాంప్రదాయ దుస్తులు (ధోతీ) ధరించడం ఎంతో గర్వకారణమని, కానీ ఒక పార్లమెంట్ సభ్యుడిని ఇలా ఆహార్యం ఆధారంగా కించపరిచేలా మాట్లాడటం ఎంతమాత్రం సరికాదని బ్రిట్టాస్ పేర్కొన్నారు. సభలో విధులు నిర్వర్తిస్తున్న సమయంలో తనను పదే పదే అడ్డుకుంటూ ఈ రకమైన వ్యాఖ్యలు చేశారని ఆయన తెలిపారు. ఈ అంశంపై రాజ్యసభలో చర్చ సందర్భంగా సభానాయకుడు జేపీ నడ్డా స్పందిస్తూ... ఏ ప్రాంత ఆహార్యాన్నైనా అవమానించేలా చేసే వ్యాఖ్యలను తాము సమర్థించబోమని, అది ధోతీ అని, దానికి తగిన గౌరవం ఇస్తామని స్పష్టం చేశారు. బ్రిట్టాస్ లేవనెత్తిన అభ్యంతరాలు రికార్డుల్లోకి వెళ్లాయని తెలిపారు. అదే సమయంలో కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు మాట్లాడూతూ... సభలో సభ్యులందరూ సమానమేనని, ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎంపీ సుష్మితా దేవ్‌కు కూడా తన వివరణ ఇచ్చుకునే అవకాశం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. సభా హుందాతనాన్ని, ప్రాంతీయ సంస్కృతులను కాపాడాలని స్పష్టం చేసిన రాజ్యసభ ఛైర్మన్, సంబంధిత ఎంపీలను తన ఛాంబర్‌కు ఆహ్వానించి మాట్లాడతానని వెల్లడించారు.

## జిఆర్ఎంబి ఎజెండాపై తెలంగాణ అభ్యంతరం

### ఎజెండాలో గత అంశాలను తొలగించాలని డిమాండ్

**హైదరాబాద్ :** గోదావరి రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు అజెండాపై తెలంగాణ ప్రభుత్వం అభ్యంతరాలు వ్యక్తం చేసింది. ఈ నెల 18వ తేదీన జీఆర్ఎంబీ 18వ సమావేశం జరగనుంది. తెలంగాణ ప్రాజెక్టులపై మూడు అంశాలు అజెండాలో పెట్టడంపై అభ్యంతరం తెలిపింది. సమ్మక్క బ్యారేజీకి అనుమతులు నిలిపివేయాలనే అంశాన్ని తొలగించాలని కోరింది. తెలంగాణ ప్రాజెక్టుల టిఎసి అనుమతుల వివరాల అంశం కూడా వద్దని తెలిపింది. సిడబ్ల్యూసి తదితర సంస్థలు ఇచ్చిన అనుమతుల సమీక్ష అంశంపైనా ప్రభుత్వం అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ అంశాలపై ఇప్పటికే జీఆర్ఎంబీలో విస్తృతంగా చర్చించామని వెల్లడించింది. గతంలో ఏపీ అభ్యంతరాలను సిడబ్ల్యూసి పరిశీలించి తిరస్కరించిందని తెలంగాణ సర్కార్ వాదించింది. సిడబ్ల్యూసి అవార్డు, మార్గదర్శకాల ప్రకారమే ప్రాజెక్టులకు అనుమతులు ఇచ్చినట్లు స్పష్టం చేసింది. మూడు అంశాలను అజెండా నుంచి డ్రాప్ చేయాలని జీఆర్ఎంబీకి తెలంగాణ సర్కార్ లేఖ రాసింది. సవరించిన అజెండా విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వం విజ్ఞప్తి చేసింది. ఇదిలావుంటే ఈ ఎజెండాపై వారం క్రితమే మాజీమంత్రి హరీష్ రావు అభ్యంతరాలు వ్యక్తం చేశారు. అజెండా అంశాలను ఎలా అంగీకరిస్తారని ప్రశ్నించారు.

## ఎల్బీనగర్ పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్ ఆత్మహత్య

### స్టేషన్ ముందు కుటుంబ సభ్యుల ఆందోళన

**హైదరాబాద్ :** ఎల్బీనగర్ పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్ ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కలకలం రేపింది. రాత్రి విధుల్లో ఉన్న కానిస్టేబుల్ జె.సాయి కుమార్ బుధవారం తెల్లవారుజామున 2.30 గంటలకు ఎల్బీనగర్ ఏసీపీ కార్యాలయంలోని రెస్ట్ రూమ్‌లో ఉరి వేసుకున్నట్టు సిబ్బంది గుర్తించారు. వెంటనే సమీపంలోని కామినేని ఆసుపత్రికి తరలించగా.. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్టు ధృవీకరించారు. పోస్టుమార్టం కోసం మృతదేహాన్ని ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. 2024 బ్యాచ్‌కు చెందిన సాయికుమార్‌ను.. ప్రస్తుతం ఈ-కాప్స్ డ్యూటీ కోసం ఎల్బీనగర్ ఏసీపీ కార్యాలయానికి అటాచ్ చేశారు. కర్మన్‌ఘాట్‌లో స్నేహితులతో కలిసి ఓ గదిలో ఉంటున్న సాయికుమార్ ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది. మరో వైపు ఎల్బీనగర్ పోలీస్ స్టేషన్ ఎదుట మృతుని కుటుంబ సభ్యులు ఆందోళనకు దిగారు. సాయికుమార్ ఆత్మహత్య చేసుకోలేదని, రక్తపు మరకలు ఎలా వచ్చాయని పోలీసులతో వాగ్వాదానికి దిగారు. వందలాది మంది పీఎస్ వద్దకు చేరుకుని ధర్నా నిర్వహించారు. ఒక దశలో పీఎస్‌లోకి దూసుకెళ్లి కంప్యూటర్, ప్రింటర్ ధ్వంసం చేశారు. ఉద్రిక్తత నెలకొనడంతో భారీగా

# డిఫాల్ట్ రైస్ మిల్లర్ల నుంచి బకాయిలను వెంటనే వసూలు చేయాలి

**మొదటి పేజీ తరువాయి..** ప్రాజెక్ట్ చేపట్టాలని ఆదేశించారు. పర్యవేక్షణ కోసం ప్రతి జిల్లాకు ఒక నోడల్ అధికారిని నియమించాలని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు.

# మళ్లీ పెరిగిన బంగారం ధరలు

**మొదటి పేజీ తరువాయి..** ఉదయం 11 గంటల సమయంలో 10 గ్రాముల 24 క్యారెట్ల పసిడి ధర రూ.1,54,860 వద్ద ట్రేడ్ అవ్వగా, 22 క్యారెట్ల ధర రూ.1,41,950 వద్దకు చేరుకుంది. అలాగే 18 క్యారెట్ల బంగారం ధర రూ.1,16,140 వద్ద నమోదైంది. పండుగల సీజన్‌లో ఇలా ధరలు ఒక్కసారిగా పుంజుకోవడం పట్ల మహిళలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

## చర్చకు సిద్ధం: అమిత్ షా ప్రకటన

**మొదటి పేజీ తరువాయి..** రాహుల్ గాంధీ తీవ్రంగా స్పందించారు. విద్యార్థులపై లాఠీఛార్జ్, కాల్పులకు ఆదేశాలు ఇచ్చింది ఎవరని ప్రశ్నించారు. గడచిన 20 రోజులుగా మాట్లాడని హోంమంత్రి, పార్లమెంట్ సమావేశాలు ముగిసే సమయానికి నాటకాలు ఆడుతున్నారంటూ మండిపడ్డారు.

# నీటివాటలపై రాజీ లేదు

కృష్ణా, గోదావరి నీటి వాటాల విషయంలో తెలంగాణ ప్రయోజనాలపై ఎట్టిపరిస్థితుల్లోనూ రాజీపడే ప్రసక్తి లేదని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి డి. శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ వైఫల్యాల వల్లే నీటి కేటాయింపుల్లో తెలంగాణకు తీవ్ర నష్టం జరిగిందని ఆయన విమర్శించారు. బుధవారం గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడిన ఆయన, రాబోయే జీఆర్ఎంబీ (గోదావరి నదీ యాజమాన్య బోర్డు) సమావేశానికి హాజరై రాష్ట్రానికి రావాల్సిన న్యాయమైన నీటి వాటా కోసం బలంగా పోరాడతామని వెల్లడించారు. అసత్య ప్రచారాలతో ప్రజలను పక్కదోవ పట్టించడం బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్‌కు అలవాటుగా మారిందని మంత్రి మండిపడ్డారు. భూ కేటాయింపులపై కేటీఆర్ చేసిన ఆరోపణలను ఖండిస్తూ... గత బీఆర్ఎస్ హయాంలో ఎకరా భూమిని రూ. 90 లక్షలకే కట్టబెడితే, తమ ప్రభుత్వం నిబంధనల ప్రకారమే ఎకరాకు కోటిన్నర చొప్పున 5 ఎకరాలను రూ. 7.5 కోట్లకు కేటాయించిందని స్పష్టం చేశారు. కేటీఆర్ చెప్తున్న రూ. 200 కోట్ల లెక్కలు ఎక్కడి నుంచి వచ్చాయో సమాధానం చెప్పాలని నిలదీశారు. నూతన హిల్ట్ (ఎ×ూ) పాలసీ ద్వారా హైదరాబాద్ ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని, పారిశ్రామికవేత్తలను భయపెడుతూ రాష్ట్ర అభివృద్ధిని అడ్డుకోవడం సరికాదని కేటీఆర్‌కు హితవు పలికారు. బీఆర్ఎస్ చేస్తున్న గోబెల్స్ ప్రచారాన్ని ప్రజలు నమ్మడం లేదని, అందుకే వరుస ఎన్నికల్లో ఆ పార్టీని తిరస్కరిస్తున్నారని శ్రీధర్ బాబు వ్యాఖ్యానించారు.

## రాజ్యసభలో 'లుంగీవాలా వ్యాఖ్యలు' కలకలం

### బీజేపీ ఎంపీ సుష్మితా దేవ్ వ్యాఖ్యలపై ఎంపీ జాన్ బ్రిట్టాస్ ఆగ్రహం

**న్యూఢిల్లీ,** రాజ్యసభలో 'లుంగీవాలా వ్యాఖ్యలు' కలకలానికి దారి తీశాయి. బీజేపీ ఎంపీ సుష్మితా దేవ్ తనను లుంగీవాలా అంటూ అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారని సీపీఐ (ఎమ్) ఎంపీ జాన్ బ్రిట్టాస్ ఆరోపించారు. ఆమె వ్యాఖ్యలను ఖండిస్తూ తీర్మానాన్ని కూడా ప్రవేశపెట్టారు. దక్షిణాది వ్యక్తిగా తన ఆహార్యం తనకు ఎంతో గర్వకారణమని ఎంపీ జాన్ బ్రిట్టాస్ తెలిపారు. పార్లమెంటు వేదికగా కించపరిచే వ్యాఖ్యలు చేయడం విచారకరమని అన్నారు. 'ఇటీవల ఓ రోజు నేను సభలో మాట్లాడుతుంటే ఆమె లుంగీవాలా అంటూ నన్ను ఉద్దేశించి అమర్యాదకర వ్యాఖ్యలు చేశారు. నేను ధోతీతో ఉన్నా. మలయాళీని, దక్షిణాది వ్యక్తిని అయినందుకు గర్వపడుతున్నా. అయితే, అవమానకర వ్యాఖ్యలు చేయడం ఎంత మాత్రం ఆమోదయోగ్యం కాదు. ఈ విషయంపై సభ దృష్టి సారించాలి. ఆమెకు వ్యతిరేకంగా ప్రివిలెజ్ మోషన్‌ను ప్రవేశపెట్టాను' అని తెలిపారు. తన బాధ్యతలు నిర్వర్తించనీయకుండా ఎంపీ దేవ్ పదే పదే అడ్డుపడ్డారని ఎంపీ బ్రిటాస్ ఆరోపించారు. పలు మార్లు లుంగీవాలా అని అన్నారని ఆరోపించారు. ఈ వార్తలపై రాజ్యసభలో జేపీ నడ్డా మాట్లాడుతూ లుంగీ కామెంట్స్‌ను తాము సమర్థించమని స్పష్టం చేశారు. బ్రిట్టాస్ అభ్యంతరాలు, వ్యాఖ్యలు అన్నీ రికార్డుల్లోకి చేరాయని అన్నారు. తమ దృష్టిలో అది ధోతీ అని కూడా చెప్పారు. సభ హుందాతనాన్ని కాపాడాల్సిన అవసరం ఉందని కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు కూడా అభిప్రాయపడ్డారు. 'సభ సభ్యులందరూ సమానమే. ఒక ఎంపీపై ఆరోపణలు వచ్చాయి కాబట్టి వారికి తమ వివరణ ఇచ్చేందుకూ అవకాశం ఇస్తున్నాము' అని అన్నారు.

# షార్ట్‌కట్స్ కోసం వెంపర్లాడొద్దు

**మొదటి పేజీ తరువాయి.** ఈ ప్రత్యేక సందర్భంలో ప్రధాని మోదీ మాట్లాడుతూ, కోవింద్‌తో తనకు ఉన్న దశాబ్దాల అనుబంధాన్ని నెమరువేసుకున్నారు. దేశాధిపతిగా ఆయన అందించిన సలహాలు, మార్గదర్శకత్వం మరియు చూపిన ఆత్మీయత తనకు ఎంతో విలువైనవని తెలిపారు. ముఖ్యంగా జాతీయ ప్రయోజనాల కోసం 'ఒకే దేశం - ఒకే ఎన్నిక' అంశంపై కోవింద్ చేసిన కృషి, ఇచ్చిన సూచనలు రాబోయే రోజుల్లో దేశాన్ని ప్రగతి పథంలో నడిపించడంలో కీలక పాత్ర పోషిస్తాయని కొనియాడారు.

ఈ పుస్తకం కేవలం ఒక వ్యక్తి జీవిత కథ మాత్రమే కాదని, భారత ప్రజాస్వామ్యానికి మరియు సమాజానికి సుదీర్ఘ కాలం గుర్తుండిపోయే విశిష్ట వారసత్వమని ప్రధాని పేర్కొన్నారు. సాధారణ స్థాయి నుంచి అత్యున్నత రాష్ట్రపతి పదవి వరకు కోవింద్ సాగించిన ప్రయాణం, ఆయన ఎదుర్కొన్న సవాళ్లు నేటి యువతకు ఎంతో స్ఫూర్తిదాయకమని వ్యాఖ్యానించారు. నవతరం ప్రతి ఒక్కరూ ఆయన అనుభవాల నుంచి పాఠాలు నేర్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ గ్రంథానికి 'ట్రయంఫ్ ఆఫ్ ది ఇండియన్ రిపబ్లిక్' అని పేరు పెట్టడం ఎంతో అర్థవంతంగా ఉందని, ఆయన జీవితంలోని పోరాటాలు వ్యక్తిగతమైనవే అయినప్పటికీ, వాటి ద్వారా లభించిన విజయాలు మాత్రం భారత గణతంత్ర వ్యవస్థకే దక్కుతాయనే గంభీరమైన సందేశం ఈ పుస్తకం ద్వారా వ్యక్తమవుతోందని వివరించారు.

## మన వారసత్వంతో ఏనుగులు భాగస్వామ్యం

### ప్రపంచ ఏనుగుల దినోత్సవం సదర్భంగా పవన్ పోస్ట్

**అమరావతి :** ఏనుగుల సంరక్షణకు కట్టుబడి ఉన్నామని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. ప్రపంచ ఏనుగుల దినోత్సవం సందర్భంగా సోషల్ మీడియా ఎక్స్ వేదికగా పవన్ స్పందిస్తూ.. ఏనుగుల ఆవాసాలు, కారిడార్ల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు చెప్పారు. ఏనుగు కేవలం అడవిలో జీవి మాత్రమే కాదని, పర్యావరణ సమతులత్యకు ప్రతీక అన్నారు. భారతదేశ వారసత్వం లో ఏనుగులు అంతర్భాగమని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో కుంకీ ఏనుగులు, హనుమాన్ చొరవతో వన్యప్రాణుల రక్షణ రక్షణను మరింత సమర్థవంతంగా ముందుకు తీసుకెళ్తామని పవన్ వెల్లడించారు. శిక్షణ పొందిన సిబ్బంది, రెస్క్యూ మౌలిక వసతులు, సాంకేతికతతో వేగవంతంగా స్పందించే వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. సురక్షిత సమాజాలు, రక్షిత అడవులు, ఏనుగులకు సురక్షిత ఆవాసాలే లక్ష్యమని స్పష్టం చేశారు. ఏనుగులను కాపాడాలి.. అడవులను రక్షించాలి.. భవిష్యత్తు ను భద్రపరచాలి అంటూ ఎక్స్‌లో పవన్ కల్యాణ్ పోస్ట్ చేశారు.

## రేవంత్ సోదరుల భూకుంభకోణం నిజం

### మేం టి హబ్‌ను తెస్తే..వారు అనుముల హబ్స్‌తో దోపిడీ

### మరోమారు ఎక్స్ వేదికగా కెటిఆర్ విమర్శలు

**హైదరాబాద :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోదరులు భూకుంభకోణాలకు పాల్పడుతున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపణలు గుప్పించారు. సోషల్ మీడియా ఎక్స్ వేదికగా స్పందిస్తూ.. 'ఇన్నోవేటర్ ఆఫ్ ది సెంచరీ'గా అనుముల కొండల్ రెడ్డిని ప్రకటించాలని ఎద్దేవా చేశారు. నిజమైన స్టార్టప్‌లు ఎదగాలని, నిరుద్యోగ యువతకు ఉపాధి దక్కాలని తాము కష్టపడి టి హబ్‌ను 'ను నిర్మిస్తే... సీఎం రేవంత్ రెడ్డి మాత్రం తన కుటుంబ ప్రయోజనాల కోసం 'అనుముల హబ్స్' ఏర్పాటు చేయడంలో బిజీగా ఉన్నారని విమర్శించారు. ఇది ఫ్యామిలీ-రన్.. ఫ్యామిలీ-డ్రైవ్.. జీరో ఇన్నోవేషన్.. జీరో ఎంఎ÷-లాయీస్ స్కామ్ అంటూ ఆరోపించారు. అనుముల సోదరుల్లో ఒకరైతే చాలు.. ఎటువంటి ప్రశ్నలు లేకుండా వందల కోట్లు విలువైన భూములు దక్కించుకోవచ్చంటూ సెటైర్ విసిరారు. 'సున్నా పెట్టుబడితో టెస్సరాక్ట్ అడ్వాన్స్‌డ్ సిస్టమ్ అనే డిఫెన్స్ కంపెనీ పెట్టి, రాత్రికి రాత్రే కనీసం రూ.200 కోట్ల లాభం ఆర్జించినందుకు 'ఇన్నోవేటర్ ఆఫ్ ది సెంచరీ'గా అనుముల కొండల్ రెడ్డిని ప్రకటించాల్సిందే. శ్రీధర్ బాబు, రేవంత్ రెడ్డి.. తెలంగాణలోని లక్షలాది మంది నిరుద్యోగ యువతకు కూడా ఈ అద్భుతమైన 'బిజినెస్ మోడల్' ఏంటో నేర్పించండి. వందల కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని ఇంత చౌకగా ఎలా పొందాలో శిక్షణ ఇవ్వండి. ఈ మ్యాజిక్ ట్రిక్ కేవలం అనుముల కుటుంబానికే ఎందుకు పరిమితం కావాలి? తెలంగాణ యువత మొత్తానికి ఈ 'అనుముల హబ్' అవకాశాన్ని కల్పించండి' అంటూ ఎక్స్‌లో కేటీఆర్ సెటైరికల్ కామెంట్స్ చేశారు.

# 16న బిచ్కుందకు సీఎం రేవంత్ రెడ్డి

- ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు కుమార్తె వివాహ విందుకు హాజరు..
- సీఎం పర్యటన నేపథ్యంలో అధికారుల విస్తృత ఏర్పాట్లు

బిచ్కుంద,/ ఆగస్టు 12/జన సంఘర్షణ: జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు కుమార్తె వివాహ విందు కార్యక్రమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి ఈ నెల 16న బిచ్కుందకు రానున్నారు. ఉదయం 9 గంటలకు బిచ్కుందలోని డీబీఎల్ మైదానంలో నిర్వహించనున్న ఈ వివాహ విందుకు నియోజకవర్గ ప్రజలు, అభిమానులు, శ్రేయోభిలాషులు పెద్ద సంఖ్యలో హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించాలని ఎమ్మెల్యే కుటుంబ సభ్యులు కోరారు.

**సీఎం పర్యటనపై అధికారుల కసరత్తు**

సీఎం పర్యటన నేపథ్యంలో జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర, జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతరావు, డీసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ బుధవారం బిచ్కుందలో పర్యటించారు. డీబీఎల్ మైదానంతో పాటు హెలిప్యాడ్ ప్రాంతాన్ని పరిశీలించి ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించారు. వేదిక, హెలిప్యాడ్, బారికేడ్లు, పార్కింగ్, ట్రాఫిక్ నియంత్రణ, భద్రతా చర్యలపై అధికారులు ప్రత్యేకంగా దృష్టి సారించారు. సీఎం పర్యటన ఎలాంటి ఆటంకాలు లేకుండా సజావుగా జరిగేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. సీఎం ప్రయాణ మార్గంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా పటిష్ట భద్రతా చర్యలు చేపట్టాలని ఎస్పీ పోలీసు అధికారులను ఆదేశించారు.

**భారీగా తరలిరానున్న ప్రజలు.....**

.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాక నేపథ్యంలో బిచ్కుందలో పోలీసు, రెవెన్యూ తదితర శాఖల అధికారులు ఏర్పాట్లను ముమ్మరం చేశారు. ఎమ్మెల్యే కుటుంబ సభ్యులు సైతం ఏర్పాట్లను దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు. వివాహ విందుకు నియోజకవర్గం నలుమూలల నుంచి భారీ సంఖ్యలో ప్రజలు తరలివచ్చే అవకాశం ఉండటంతో పార్కింగ్, ట్రాఫిక్, భద్రతా ఏర్పాట్లపై అధికారులు ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. సీఎం పర్యటనను విజయవంతంగా నిర్వహించేందుకు అధికారులు అన్ని చర్యలు చేపడుతున్నారు.





# పోచారం శ్రీనివాసరెడ్డికి బీఆర్ఎస్‌లో నో ఎంట్రీ!

- క్రెడిబిలిటీ లేని నేత.. కాంగ్రెస్‌లో ఎక్కడో చెడింది: బాజిరెడ్డి గోవర్ధన్

హైదరాబాద్, /ఆగస్టు 12: /( జన సంఘర్షణ) మాజీ స్పీకర్, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి రాజకీయ పునరాగమనంపై బీఆర్ఎస్‌లో అప్పుడే అసమ్మతి స్వరాలు వినిపిస్తున్నాయి. పోచారం శ్రీనివాసరెడ్డిని తిరిగి బీఆర్ఎస్‌లోకి రానివ్వబోమని మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నేత బాజిరెడ్డి గోవర్ధన్ స్పష్టం చేశారు. పోచారం క్రెడిబిలిటీ లేని నేత అంటూ ఆయన తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. పోచారం శ్రీనివాసరెడ్డికి కాంగ్రెస్‌లో ఎక్కడో చెడిందని, అందుకే తిరిగి బీఆర్ఎస్ వైపు అడుగులు వేస్తున్నారని బాజిరెడ్డి ఎద్దేవా చేశారు. అధికారం ఎక్కడ ఉంటే అక్కడికి వెళ్లడం పోచారం శ్రీనివాసరెడ్డికి అలవాటుగా మారిందని విమర్శించారు.




**అధికారం ఉన్న చోటుకే అడుగులు..**

పోచారం శ్రీనివాసరెడ్డి రాజకీయ ప్రస్థానాన్ని ప్రస్తావించిన బాజిరెడ్డి గోవర్ధన్.. అధికారం ఉన్న పార్టీలోనే కొనసాగేందుకు ఆయన ప్రయత్నిస్తుంటారని ఆరోపించారు. ప్రస్తుతం కాంగ్రెస్‌లో ఉన్న పోచారం.. అక్కడ పరిస్థితులు అనుకూలంగా లేకపోవడంతో ప్లేటు ఫిరాయించే పనిలో ఉన్నారని ఘాటు వ్యాఖ్యలు చేశారు. పోచారం శ్రీనివాసరెడ్డి చేసిన వ్యాఖ్యలపై

**బీఆర్ఎస్‌లోకి రానివ్వం..**

పోచారం శ్రీనివాసరెడ్డి తిరిగి బీఆర్ఎస్‌లో చేరేందుకు ప్రయత్నించినా తాము అంగీకరించబోమని బాజిరెడ్డి గోవర్ధన్ తేల్చిచెప్పారు. ఆయన వ్యాఖ్యలు ప్రస్తుతం బీఆర్ఎస్‌లో రాజకీయ చర్చకు దారితీశాయి. పోచారం వ్యాఖ్యలకు బీఆర్ఎస్ నేతలు చేసిన కౌంటర్‌తో ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో రాజకీయ వాతావరణం మరోసారి వేడెక్కింది.

బీఆర్ఎస్ నేతలు స్పందిస్తూ.. ఆయనపై విమర్శలు గుప్పించారు. పార్టీ మారిన నేతలకు ప్రజల్లో విశ్వసనీయత తగ్గిపోతుందని, రాజకీయ ప్రయోజనాల కోసం పార్టీలు మారడం సరికాదని వ్యాఖ్యానించారు.

# ఎన్‌హెచ్–161(బి) విస్తరణ పనులు వేగవంతం చేయాలి

- కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి ఎంపీ సురేష్ షెట్కార్ రిమైండర్ లేఖ

జహీరాబాద్ / న్యూఢిల్లీ, ఆగస్టు 12:/జన సంఘర్షణ) నారాయణఖేడ్ పట్టణ పరిధిలో అసంపూర్తిగా ఉన్న ఎన్‌హెచ్–161(బి) జాతీయ రహదారి విస్తరణ పనులను వెంటనే చేపట్టాలని కోరుతూ జహీరాబాద్ ఎంపీ సురేష్ కుమార్ షెట్కార్ కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీకి మరోసారి రిమైండర్ లేఖ రాశారు. తెలంగాణ సరిహద్దు నుంచి బీదర్ ఔటర్ రింగ్ రోడ్డు... వరకు చేపడుతున్న ఎన్‌హెచ్–161(బి) అభివృద్ధి పనుల్లో నారాయణఖేడ్ పట్టణ పరిధిలోని కీలక రహదారి భాగం మిగిలిపోయిందని ఎంపీ పేర్కొన్నారు. గతంలో తాను చేసిన విజ్ఞప్తిపై సానుకూలంగా స్పందించి, ప్రతిపాదనను పరిశీలించాలని అధికారులను ఆదేశించినందుకు కేంద్ర మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

**4.50 నుంచి 8 కిలోమీటర్ల వరకు పెండింగ్...**

నిజాంపేట్–నారాయణఖేడ్–బీదర్ రహదారి ఇరువైపులా విస్తరణ పనులు కొనసాగుతున్నప్పటికీ.. నారాయణఖేడ్ పట్టణ పరిధిలోని 4.50 కిలోమీటర్ల నుంచి 8.00 కిలోమీటర్ల వరకు ఉన్న సుమారు 3.50 కిలోమీటర్ల రహదారి భాగం ప్రస్తుత ప్రాజెక్టులో చేర్చలేదని ఎంపీ తెలిపారు. దీంతో పట్టణంలో తరచూ భారీగా ట్రాఫిక్ జామ్‌లు ఏర్పడుతూ ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు.



**డ్రైనేజీ లేక ఇబ్బందులు.. తరచూ ప్రమాదాలు...**

ఇరుకైన రహదారి కారణంగా రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడటంతో పాటు సరైన డ్రైనేజీ వ్యవస్థ లేక వర్షాకాలంలో మరిన్ని సమస్యలు తలెత్తుతున్నాయని షెట్కార్ తెలిపారు. రద్దీ ఎక్కువగా ఉండటంతో ఈ ప్రాంతంలో తరచూ రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.

**సెంట్రల్ లైటింగ్‌తో ఆధునిక రహదారి**

మిగిలిపోయిన రహదారి భాగాన్ని కూడా ప్రస్తుత ప్రాజెక్టులో చేర్చి సమగ్రంగా అభివృద్ధి చేయాలని ఎంపీ కోరారు. రహదారి విస్తరణతో పాటు సెంట్రల్ లైటింగ్, ఆధునిక డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ పనులు పూర్తయితే తెలంగాణ–కర్ణాటక మధ్య రవాణా మరింత సులభతరం కావడంతో పాటు నారాయణఖేడ్ పట్టణ ప్రజలకు కూడా భారీగా ఉపశమనం లభిస్తుందని పేర్కొన్నారు. ప్రాంత ప్రజల సామాజిక, ఆర్థిక ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ప్రతిపాదనపై సాంకేతిక పరిశీలనను త్వరగా పూర్తి చేసి, అవసరమైన నిధులు మంజూరు చేసి పనులను ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని ఎంపీ సురేష్ కుమార్ షెట్కార్ కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని కోరారు.

# వికలాంగుల పెన్షన్ పెంచాలి



ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 12 (జన సంఘర్షణ) రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాకముందు వికలాంగులకు ఇచ్చిన హామీ మేరకు వచ్చే తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం జూన్ రెండవ తారీఖున వికలాంగులకు ఇచ్చే పెన్షన్ 4016 నుండి 6 వేలకు పెంచాలని దివ్యాంగుల సంక్షేమం జిల్లా అధ్యక్షులు కుమార్ డిమాండ్ చేశారు. దివ్యాంగులు మనోధైర్యం కోల్పోకుండా రాజకీయాలలో 5 శాతం కేటాయిస్తామన్న కాంగ్రెస్ ఇప్పటికీ అమలు చేయడం లేదని గుర్తు చేశారు. వెంటనే అమలు చేయాలని ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలి ఆయన ప్రభుత్వాన్ని కోరారు. వికలాంగులకు ఇందిరమ్మ ఇళ్లలో మొదటి ప్రాధాన్యత ఇచ్చిన తర్వాత ఇతరులకు ఇవ్వాలని, అదే రకంగా ఇప్పటివరకు అంత్యోదయ కార్డులు లేని వారికి వెంటనే కార్డులను మంజూరు చేయాలని వికలాంగులకు ఇచ్చిన హామీ మేరకు తెలంగాణ ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణించే విధంగా సౌకర్యం కల్పించాలనిఓ ఆయన ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వికలాంగుల జిల్లా అధ్యక్షుడు కుమ్మరి కుమార్,వాసు రామ్ నాయక్, భూమయ్య, ఉందిగళ్ల పాతూరి శ్రీనివాస్, గంగాపురం సంజీవులు, బాచుపల్లి పాండు, రెడ్యా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# ఆపదలో అండగా.. ఆప్యాయతతో చేయూతగా.. డా. రవి బదావత్

- మృతుడి కుటుంబానికి మిషన్ వాక్ వ్యవస్థాపకుడు డా. రవి బదావత్ఆర్థిక సహాయం



ఆగస్టు 12, (జనసంఘర్షణ) : మానవత్వం, సామాజిక బాధ్యతకు ప్రతీకగా మిషన్ వాక్ రిహాబిలిటేషన్ వ్యవస్థాపకుడు డా. రవి బదావత్ ఇటీవల మృతి చెందిన అజ్మీరా పకీరా కుటుంబానికి ఆర్థిక సహాయం అందించారు. ఖమ్మం జిల్లా సింగరేణి, మధారం పరిధిలోని కొత్త తండా గ్రామానికి చెందిన అజ్మీరా పకీరా ఇటీవల మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న డా. రవి బదావత్ వారి కుటుంబాన్ని పరామర్శించి, రూ.5,000 ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా డా. రవి బదావత్ కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. కష్టకాలంలో బాధిత కుటుంబాలకు అండగా నిలవడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని ఆయన పేర్కొన్నారు. కుటుంబ సభ్యులకు మనోధైర్యం కలగాలని ఆకాంక్షించారు. మిషన్ వాక్ రిహాబిలిటేషన్ సంస్థ వైద్య సేవలతో పాటు సామాజిక సేవా కార్యక్రమాలకు కూడా ప్రాధాన్యత ఇస్తూ, అవసరమైన సమయంలో ప్రజలకు అండగా నిలుస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు డా. రవి బదావత్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కష్ట సమయంలో తమ కుటుంబానికి అండగా నిలిచినందుకు ధన్యవాదాలు వ్యక్తం చేశారు. మానవత్వమే నిజమైన సేవ – కష్టాల్లో ఉన్న వారికి అండగా నిలవడమే సామాజిక బాధ్యత అని ఈ కార్యక్రమం ద్వారా మరోసారి చాటిచెప్పారు.

# బైపాస్ వద్ద వై జంక్షన్ వెంటనే నిర్మించాలి

- మాజీ ఎంపీటీసీ సభ్యుడు ఎస్.కె. హైమద్ కోరారు.




ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 12 (జన సంఘర్షణ) మెదక్ జిల్లా రామాయంపేట గ్రామ, మండల ప్రజలకు నమస్కారం. బైపాస్ వై జంక్షన్ వద్ద ఎన్నో ప్రాణాలు పోతున్నాయి. అక్కడ మనము మన కుటుంబ సభ్యులు కూడా అక్కడి నుండి భయంగా ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని ప్రయాణిస్తున్నాము. అక్కడ బ్రిడ్జ్ సాక్షన్ అయ్యింది. కానీ పనులు స్టార్ట్ అయ్యేలోపు చాలా టైం పట్టేలా ఉంది. ఈ గడిచిన 10 రోజుల్లోనే ఏంతో మంది గాయలపాలయ్యారు. ప్రాణాలు సైతం పోయాయి. అందుకు నిన్న కొందరు నాయకులు కొందరు స్పందించి డ్రమ్ములతో రోడ్డుని క్లోజ్ చేశారు కానీ పోలీస్ వారు ఇది కరెక్ట్ కాదు అక్కన్నపేట బ్రిడ్జ్ వద్ద లైటింగ్ వేయించాక ఇక్కడ క్లోజ్ చేద్దాం అనీ చెప్పడం జరిగింది. దీనిపైన రామాయంపేట మండల, పట్టణ ప్రజలు,యువకులు, కుల సంఘాల పెద్దమనుషులు, వర్తక వ్యాపారస్తులు, ముఖ్యంగా వై జంక్షన్ వద్ద జరుగుతున్న ప్రతీ సమస్యను మరియు ప్రమాధాలకు సంబందించిన వార్తలను మన కళ్ళ ముందు చూపిస్తున్న పత్రిక ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియావారు అలాగే నిత్యం అటు వైపు నుండి ప్రయాణం చేస్తూ పట్టణంలోని విద్యా సంస్థలకు విద్యార్థులు వస్తున్నా విద్యా సంస్థల ఆధిపతులు, విద్యార్థి నాయకులు పార్టీలకు అతీతంగా రాజకీయ నాయకులు ప్రతీ ఒక్కరూ దీనిపై స్పందించి మనకు సంబందించిన వారి ప్రాణాలు మనమే కాపాడుకువాలి. కాబట్టి దీనిపైన మనందరం ఒకరోజు ధర్నా రోడ్డు దిగ్బంధం చేస్తేనే పరిష్కారం దొరుకుతుంది కాబట్టి ప్రతీ ఒక్కరూ స్పందించాలనీ మాజీ ఎంపీటీసీ సభ్యుడు ఎస్.కె హైమద్ కోరారు.

# గ్రూప్ 2 ట్రైనీ ఆఫీసర్లకు వైద్యశాఖ కార్యక్రమాలపై అవగాహన





ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 12 (జన సంఘర్షణ) జిల్లాలోని వివిధ శాఖల కార్యక్రమాలపై ట్రైనింగ్‌లో భాగంగా బుధవారం హవేలీ ఘనపురం మండలం సర్ధన పి.హెచ్.సి. పరిధిలోని గ్రూప్ 2 ట్రైనీ ఆఫీసర్లు ( తహశీల్దార్లు) సందర్శించి పి.హెచ్.సి.ద్వారా ప్రజలకు అందుతున్న వైద్య సేవలు, పి.హెచ్.సి. సిబ్బంది విధులు, ఆశ కార్యకర్త సేవలు, ఏ.ఎన్.ఎం, సూపర్వైజర్, ఫార్మసీ ఆఫీసర్, నర్సింగ్ ఆఫీసర్, మెడికల్ ఆఫీసర్ ల విధి విధానాలు, జాతీయ ఆరోగ్య కార్యక్రమాలు, ప్రజలకు అందిస్తున్న నిరంతర సేవల గురించి హెల్త్ ఎక్స్టెన్షన్ ఆఫీసర్ ఎస్. మదన్ మోహన్ వివరంగా తెలియజేశారు. ఎం.ఎల్.హెచ్.పి.అర్. సమదానిక, హెల్త్ సూపర్వైజర్ టి.ఏ.సునంద, ఏ.ఎన్.ఎం.సునీత, ఆశ కార్యకర్తలు కార్యక్రమంలో పాల్గొన్నారు.

# కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ ఉద్యోగాలకు ఆహ్వానం

- ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ నితిన్ కాబ్ర.

ఉమ్మడి వెంకట్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 12 (జన సంఘర్షణ) మెదక్ ప్రభుత్వ మెడికల్ కాలేజీలో కాంట్రాక్టు విధానంలో 4 ప్రొఫెసర్లు, 5 అసోసియేట్ ప్రొఫెసర్లు, 06 సీనియర్ రెసిడెంట్లు, 03 ట్యూటర్లు పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ తెలిపారు. అర్హత గల అభ్యర్థులు 12- 8 - నుంచి 14 -8- 26 రోజున మధ్యాహ్నం మూడు గంటల వరకు ప్రభుత్వ మెడికల్ కాలేజ్ మెదక్ లో దరఖాస్తుల అంది ఇవ్వాలన్నారు. మెడికల్ కళాశాలలో ఔట్సోర్సింగ్ ప్రాతిపదికన పూర్తిగా తాత్కాలికంగా ఉద్యోగాల కోసం దరఖాస్తు కోరుతున్నామన్నారు.

**పోస్టుల వివరాలు ఖాళీల సంఖ్య :** అనస్థీషియా టెక్నీషియన్ 8, ఆడియో మెట్రిక్ టెక్నీషియన్ 1, ఆడియో విజువల్ టెక్నీషియన్ 1, బార్బర్. 6, బ్లడ్ బ్యాంక్ టెక్నీషియన్ 3, కార్పెంటర్. 1, క్యాటలాగర్ 1, చైల్డ్ సైకాలజిస్ట్ 1, సిటీ టెక్నీషియన్ 4, డేటా ఎంట్రీ ఆపరేటర్ 37, డెంటల్ టెక్నీషియన్ 1, దోబీ/ ప్యాకర్ 6, ఈసీజీ టెక్నీషియన్ 4, ఎలక్ట్రీషియన్ 6, గ్యాస్ ఆపరేటర్ 4, ల్యాబ్ అటెండర్ 19, మ్యూజియం అసిస్టెంట్ కం ఆర్టిస్ట్ 1, ఆఫీస్ సబర్డినేట్ 24, ప్లంబర్ 2, సైకియాట్రిక్ సోషల్ వర్కర్ 1, రేడియో గ్రాఫిక్ టెక్నీషియన్ 7, రేడియాలజీ టెక్నీషియన్ 1, రికార్డు క్లర్కు రికార్డు అసిస్టెంట్ 2, రిఫ్లెక్షన్ ఆపిటిషియన్ 1, స్పీచ్ తెరపి 1, టైలర్ 1, థియేటర్ అసిస్టెంట్ 2, ఓటి టెక్నీషియన్ అనస్తీసియా 10 మొత్తం 156 పోస్టులు ఉన్నాయని అభ్యర్థులు 13 8- 2006 ఉదయం 11 గంటల నుంచి 20-8 -2026 మధ్యాహ్నం 3:00 వరకు ప్రభుత్వ మెడికల్ కళాశాల మెదక్ లో దరఖాస్తుల స్వీకరించబడతాయన్నారు. మరిన్ని వివరాలు దరఖాస్తు ఫారం, దర్శకాలు విద్యార్హతల కోసం https://www.gmcmedak.org వెబ్సైట్ను సందర్శించాలని బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

జన సంఘర్షణ
మా లక్ష్యం సామాన్యుని పక్షం తెలుగు దినపత్రిక
గురువారం 13 ఆగస్టు 2026

# ఆర్మీ నియామకాల్లో తెలంగాణ యువతకు ప్రత్యేక శిక్షణ

- జిల్లా కేంద్రాల్లో శిక్షణా కేంద్రాల ఏర్పాటుకు సీఎం రేవంత్ రెడ్డి ప్రతిపాదన

హైదరాబాద్/, ఆగస్టు 12/జన సంఘర్షణ: భారత ఆర్మీ చేపట్టే వివిధ నియామకాల్లో తెలంగాణ యువతకు మరిన్ని అవకాశాలు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తుందని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి తెలిపారు. ఆర్మీ నియామకాలకు సిద్ధమయ్యే యువతకు ముందస్తు శిక్షణ అందించేలా ఆసక్తి ఉన్న జిల్లాల్లో ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలు నిర్వహించాలని ఆయన సూచించారు.

ఆర్మీ సదరన్ కమాండ్ జనరల్ ఆఫీసర్ కమాండింగ్–ఇన్–చీఫ్ లెఫ్టినెంట్ జనరల్ రాజేష్ పుష్కర్ పలువురు ఆర్మీ ఉన్నతాధికారులతో కలిసి బుధవారం ఎంసీఆర్ హెచ్ఆర్డీలోని బోధి పెవిలియన్‌లో ముఖ్యమంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సమావేశంలో మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి కూడా పాల్గొన్నారు. దేశవ్యాప్తంగా నిర్వహించే ఆర్మీ... రిక్రూట్‌మెంట్లకు తెలంగాణ యువత ముందుగానే సన్నద్ధం అయ్యేలా జిల్లా కేంద్రాల్లో శిక్షణా కేంద్రాలను ఏర్పాటు చేస్తామని లెఫ్టినెంట్ జనరల్ రాజేష్ పుష్కర్ తెలిపారు. ముఖ్యమంత్రి ప్రతిపాదనకు ఆయన సానుకూలంగా స్పందించారు.

**విపత్తుల సమయంలో ఆర్మీ సేవలు**

దేశంలో విపత్తులు సంభవించినప్పుడు ఆర్మీ అందిస్తున్న సేవలను సీఎం రేవంత్ రెడ్డి అభినందించారు. తెలంగాణలో వరదలు, ఇతర విపత్తుల సమయంలో రెస్క్యూ ఆపరేషన్లు, ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడం, పునరావాస చర్యల్లో ఆర్మీ మరింత చురుగ్గా భాగస్వామ్యం కావాలని కోరారు. తెలంగాణలో విపత్తు పరిస్థితులు తలెత్తినప్పుడు ప్రత్యేక చొరవతో సేవలందించేలా స్థానిక ఆర్మీ అధికారులను ఆదేశిస్తానని లెఫ్టినెంట్ జనరల్ రాజేష్ పుష్కర్ హామీ ఇచ్చారు.

**మూసీ పునరుజ్జీవనంపై ప్రశంసలు**

హైదరాబాద్ నగరాన్ని కాలుష్య రహితంగా మార్చడంతో పాటు చారిత్రక నగరానికి పూర్వవైభవం తీసుకురావాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న



మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టుపై ఆర్మీ ఉన్నతాధికారి ప్రశంసలు కురిపించారు. హైదరాబాద్ నగర భవిష్యత్తును కాపాడేందుకు మూసీ నది ప్రక్షాళన ఎంతో అవసరమని ఆయన అభిప్రాయపడ్డారు.

ఈ సమావేశంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ జనరల్ ఆఫీసర్ కమాండింగ్ మేజర్ జనరల్ ఎన్. శ్రీనివాస్ రావుతో పాటు పలువురు ఆర్మీ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# నేరాల దర్యాప్తులో వేగం పెంచాలి

- లాంగ్ పెండింగ్ కేసులపై ప్రత్యేక దృష్టి.
- విజిబుల్ పోలీసింగ్‌ను మరింత పెంచాలి.
- డ్రంక్ డ్రైవ్‌పై ప్రతిరోజూ తనిఖీలు నిర్వహించాలి.
- 'నేను సైతం'తో సీసీ కెమెరాల ఏర్పాటుకు కృషి చేయాలి.
- ఉత్తమ ప్రతిభ కనబరిచిన సిబ్బందికి ప్రశంస పత్రాలు.
- బ్లూకోల్ట్స్, నైట్ పెట్రోలింగ్ పకడ్బందీగా నిర్వహించాలి: మెదక్ జిల్లాలో ఎస్పీ.డి.వి శ్రీనివాస రావు.




ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 12 (జన సంఘర్షణ) జిల్లాలో నేరాల నియంత్రణకు పటిష్ఠ చర్యలు చేపట్టడంతో పాటు కేసుల దర్యాప్తును వేగవంతం చేయాలని జిల్లా ఎస్పీ.డి.వి.శ్రీనివాస రావు అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన నెలవారీ నేర సమీక్షా సమావేశంలో వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో దర్యాప్తులో ఉన్న పోక్సో, గ్రేవ్, నాన్ గ్రేవ్, ఎస్సీ/ఎస్టీ అట్రాసిటీ కేసుల పురోగతిని సమీక్షించారు. ప్రతి కేసును నిర్ణీత గడువులోగా దర్యాప్తు పూర్తిచేసి చార్జిషీట్లు దాఖలు చేయాలన్నారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కేసుల పరిష్కారానికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించుకోవాలని సూచించారు. గ్రేవ్ కేసుల్లో శాస్త్రీయ ఆధారాలను సేకరించి, నిందితులకు శిక్షపడేలా నాణ్యమైన దర్యాప్తు చేపట్టాలని ఆదేశించారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో విజిబుల్ పోలీసింగ్‌ను పెంచాలని, నేరాల నియంత్రణకు బ్లూకోల్ట్స్, నైట్ పెట్రోలింగ్‌ను పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. 'నేను సైతం' కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేస్తున్న సీసీ కెమెరాలను జియోట్యాగింగ్ చేయాలని తెలిపారు. రోడ్డు భద్రతలో భాగంగా ప్రతిరోజూ డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపట్టాలని, ఓవర్‌లోడ్ వాహనాలపై కూడా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పోలీస్ స్టేషన్లకు వచ్చే ఫిర్యాదుదారుల పట్ల సానుభూతితో వ్యవహరించి, వారి సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఎస్పీ సూచించారు. సీసీటియన్ఎస్, ఈ–సాక్ష్య, అప్లికేషన్లలో కేసులకు సంబంధించిన వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన పోలీస్ సిబ్బందికి జిల్లా ఎస్పీ ప్రశంసా పత్రాలు అందజేసి అభినందించారు. ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేలా అంకితభావంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్, డియస్పి లు ప్రసన్న కుమార్, నరేందర్ గౌడ్, సుభాష్ చంద్ర బోస్, సీఐ లు మహేష్, రేణుక, వెంకట రాజా గౌడ్, సైదా,సందీప్ రెడ్డి, కృష్ణ మూర్తి, రంగా కృష్ణ, ఎస్ ఐ లు సిబ్బంది పాల్గొన్నారు.

# పీఎం జడ్పిహెచ్ ఎస్ కూచన్ పల్లి ఉన్నత పాఠశాలలో పద్యధారణ పోటీలు




ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 12 (జన సంఘర్షణ) హవేలీ ఘనపూర్ మండల పరిధిలోని.పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కూచన్ పల్లి లో బుధవారం రోజు రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు తాళ్లూరి సాంబశివరావు తెలుగు భాష తెలుగు పద్యం గొప్పతనాన్ని ప్రోత్సహిస్తూ విద్యార్థిని విద్యార్థులకు పద్య ధారణ పోటీలు నిర్వహించి ఒక్క పద్యం పాడిన విద్యార్థికి పది రూపాయల చొప్పున దాదాపు 40 మంది విద్యార్థులకు 1,50,00/- రూపాయలు నగదు ప్రోత్సాహకాలు ఇచ్చి విద్యార్థులను ప్రోత్సహించారు. అలాగే వచన కవితలు రాసిన విద్యార్థులకు కూడా నగదు ప్రోత్సాహం అందజేశారు. సాంబశివరావు మాట్లాడుతూ మాతృభాష చాలా గొప్పదని తెలుగు పద్యాలు మంచి విలువలను నీతిని క్రమశిక్షణను విద్యార్థులలో పెంపొందిస్తాయని చెప్పారు . ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి పాఠశాల ప్రధానోపాధ్యాయులు మధుమోహన్ మాట్లాడుతూ.. విద్యార్థులందరూ పాఠశాల స్థాయి నుండి తెలుగు భాష పై పట్టు సాధించాలని పద్యాలు సొంతగా రాయడం నేర్చుకోవడం వలన విద్యార్థులకు ఏకాగ్రత వచ్చే అవకాశం ఉంటుందని సాంబశివరావు విద్యార్థులను ప్రోత్సహించే విధానాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయులు అభినందించారు, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ప్రతి విద్యార్థి కవితలపై పద్యాల పై పట్టు సాధించాలని ఆయన విద్యార్థుల ఉద్దేశించి అన్నారు. ఈక్రమంలో పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయులు ఎల్లం, శశి కుమార్ సీనియర్ ఉపాధ్యాయులు శివరాజ్ ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

## అనారోగ్యంతో మృతి చెందిన పలువురిని పరామర్శించిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు, నీలా గ్రూప్ చైర్మన్ డాక్టర్ మోహన్ నాయక్

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 12 (జన సంఘర్షణ)



మెదక్ పట్టణానికి చెందిన మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మేడి మధుసూదన్ రావు, టీఎంయూ రాష్ట్ర కార్యదర్శి, ఓఎస్,ఆర్టీసీ మెదక్ రాధా కిషన్ రావు తండ్రి మేడి హనుమంతరావు అనారోగ్యంతో స్వర్గస్తులైనారు. ఇట్టి సమాచారాన్ని తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ నాయకుడు లీలా గ్రూప్ చైర్మన్ డాక్టర్ మోహన్ నాయక్ వారి కుటుంబాన్ని కలిసి పరామర్శించి ప్రగాఢ సానుభూతి కల్పించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ కొండ శ్రీను, బిసి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీకాంత్, సురేష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## మాజీ ప్రధాని ఇందిరాగాంధీ గతంలో కాంగ్రెస్ పార్టీ నుండి మెదక్ నుండి గెలిచి ప్రధానిగా ప్రధానిగా ఉన్నప్పుడు గిరిజనులకు ఎంతో మేలు జరిగింది.

- లంబాడి ఐక్యవేదిక మెదక్ నియోజకవర్గ ఇన్చార్జి సురేష్ నాయక్ పేర్కొన్నారు.

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 12 (జన సంఘర్షణ) గతంలో ఇందిరాగాంధీ ప్రధానిగా ఉన్నప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో వచ్చినప్పుడు గిరిజనుల గుర్తించి పోడు భూములను అందించడం జరిగింది. కానీ కొన్ని అవకతవకల కారణాల వల్ల పోడు భూములను పట్టాలు చేయాలన్న ఉద్దేశంతో మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో గిరిజనులకు పట్టలు అందించాలని లంబాడి ఐక్యవేదిక మెదక్ నియోజకవర్గ ఇన్చార్జ్ సురేష్ నాయక్ ప్రభుత్వానికి డిమాండ్ చేయడం జరిగింది.



# పాపన్నపేట మండల కేంద్రంలో ఘనంగా హార్గర్ తిరంగా ర్యాలీ

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 12 (జన సంఘర్షణ)



భారత స్వతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని యావత్ భారతవని సంబరాలు చేసుకుంటున్న వేళ ప్రియతమ ప్రధాని, ప్రపంచం గర్వించదగ్గ నాయకుడు నరేంద్ర మోడీ పిలుపు మేరకు దేశవ్యాప్తంగా భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు బీజేపీ పాపన్నపేట మండల పార్టీ అధ్యక్షులు వడ్ల సంతోష్ చారి తెలిపారు. ఇందులో భాగంగా మెదక్ జిల్లా అధ్యక్షులు వాల్దాసు రాధా మల్లేష్ గౌడ్ ఆదేశాల మేరకు బుధవారం రోజున పాపన్నపేట మండల కేంద్రంలో జాతీయ వాదులు, బిజెపి నాయకులు, ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఉన్నత పాఠశాలల విద్యార్థిని విద్యార్థులు మువ్వన్నెల జెండాలతో పాపన్నపేట మండల కేంద్రం పురవీధుల్లో కవాతు ర్యాలీ నిర్వహించినట్లు ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ముఖ్య అతిథిగా హాజరైన మాజీ బీజేపీ మెదక్ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్ మాట్లాడుతూ మనం అనుభవిస్తున్న స్వాతంత్రం ఎంతోమంది భరతమాత బిడ్డల త్యాగాల ఫలితమేనని అందుకుగాను ప్రతి భారతీయుడు, యువత దేశభక్తిని పెంపొందించుకొని రాబోయే కాలంలో తమ వంతుగా దేశ కీర్తిని ఔన్నత్యాన్ని ఖండాంతరాలు దాటించే విధంగా ప్రతి ఒక్కరూ కృషిచేసి తమ తమ రంగాలలో రాణిస్తూ దేశభక్తిని కలిగి ఉన్నతమైన భారతీయ పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షులు బైండ్ల సత్యనారాయణ ముదిరాజ్, జిల్లా కిసాన్ మోర్చా ఉపాధ్యక్షులు బీకొండ రాములు నేత, రాష్ట్ర ఓబీసీ కార్య వర్గ సభ్యులు గడ్డం కాశీనాథ్, బీజేపీ జిల్లా నాయకులు సుభాష్ చందర్ గౌడ్, ఏంఎల్ఎన్. రెడ్డి, నాగభూషణం, మల్లేశం, బొక్కల భాగేష్, వడ్లభాగేష్, జిన్నగోపాల్, రాజు, చంద్రయ్య, సుంకరి కిష్టయ్య, నర్సింలు, వెంకట్, శ్రావణ్, గౌస్, జగదీష్ సంతోష్ గౌడ్, కనుకంటి విట్టల్, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ నర్సింలు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు మహేశ్వర్, అధ్యాపకులు గ్రామస్తులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

# మరిపెడ పోలీస్‌స్టేషన్‌లో పైకప్పు పెచ్చులు ఊడి పడి ఏఎస్సైకు గాయాలు

మహబూబాబాద్ జిల్లా/, ఆగస్టు 12:/జన సంఘర్షణ)




మరిపెడ పోలీస్‌స్టేషన్‌లో పాత భవనం పరిస్థితి మరోసారి ఆందోళనకు గురిచేసింది. విధుల్లో ఉన్న ఏఎస్సై శ్రీనివాస్‌పై ఒక్కసారిగా పైకప్పు పెచ్చులు ఊడిపడటంతో ఆయనకు గాయాలయ్యాయి. సోమవారం రాత్రి జరిగిన ఈ ఘటనతో పోలీస్‌స్టేషన్‌లో కొద్దిసేపు కలకలం నెలకొంది. పైకప్పు పెచ్చులు మీద పడటంతో గాయపడిన ఏఎస్సై శ్రీనివాస్‌ను సిబ్బంది వెంటనే ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి ప్రాణాపాయం లేదని నిర్ధారించారు. ఈ ఘటనలో పోలీస్‌స్టేషన్‌లోని కంప్యూటర్, ప్రింటర్ కూడా దెబ్బతిన్నట్లు సమాచారం.

**కొత్త భవనం పూర్తయినా.. ప్రారంభమెప్పుడో?**

మరిపెడ పోలీస్‌స్టేషన్‌కు నూతన భవన నిర్మాణం పూర్తయినప్పటికీ ఇప్పటివరకు ప్రారంభించకపోవడంతో సిబ్బంది పాత భవనంలోనే విధులు నిర్వహించాల్సి వస్తోంది. ఇప్పటికే శిథిలావస్థకు చేరిన ఈ భవనం నుంచి ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని సిబ్బంది ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి నూతన పోలీస్‌స్టేషన్ భవనాన్ని వెంటనే ప్రారంభించి, పోలీసు సిబ్బంది భద్రతకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

# అమెరికాలో అగ్నిప్రమాదం.. తెలంగాణ యువకుడి మృతి

- హనుమకొండ జిల్లాకు చెందిన 29 ఏళ్ల భరత్‌చందర్‌రెడ్డి మృత్యువాత
- 2023లో ఉన్నత చదువుల కోసం అమెరికా వెళ్లిన యువకుడు..
- స్వదేశానికి వచ్చి స్థిరపడాలనుకునేలోపే విషాదం



హైదరాబాద్ /ఆగస్టు12/(జన సంఘర్షణ ) అమెరికాలో జరిగిన అగ్నిప్రమాదం తెలంగాణకు చెందిన ఓ యువకుడి కుటుంబంలో తీవ్ర విషాదాన్ని నింపింది. హనుమకొండ జిల్లాకు చెందిన 29 ఏళ్ల భరత్‌చందర్‌రెడ్డి చికిత్స పొందుతూ మృతి చెందారు. టాంపా ప్రాంతంలో జూలై 25న జరిగిన ప్రమాదవశాత్తు అగ్నిప్రమాదంలో గంటూరుపల్లికి చెందిన భరత్‌చందర్‌రెడ్డి తీవ్రంగా గాయపడ్డారు. అప్పటి నుంచి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృత్యువుతో పోరాడిన ఆయన సోమవారం తుదిశ్వాస విడిచారు. ఉన్నత చదువుల కోసం 2023లో అమెరికా వెళ్లిన భరత్‌చందర్‌రెడ్డి.. త్వరలోనే స్వదేశానికి తిరిగి వచ్చి ఇక్కడే స్థిరపడాలని భావించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఇంతలోనే అనూహ్య ప్రమాదం ఆయన ప్రాణాలను బలిగొనడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. విదేశాల్లో మంచి భవిష్యత్తు కోసం వెళ్లిన యువకుడు అగ్నిప్రమాదంలో ప్రాణాలు కోల్పోవడంతో స్వగ్రామంలోనూ విషాదఛాయలు అలుముకున్నాయి. భరత్‌చందర్‌రెడ్డి మృతితో కుటుంబ సభ్యులు, బంధువులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు.

# రైస్ అప్పగించని మిల్లులపై ఉక్కుపాదం

- బకాయిలు..: చెల్లించకపోతే మిల్లులు స్వాధీనం..
- మహిళా సంఘాలకు అప్పగించేలా చర్యలు:. సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్/ఆగస్టు 12/జన సంఘర్షణ):



కస్టమ్ మిల్లింగ్ కోసం ప్రభుత్వం నుంచి ధాన్యం తీసుకుని నిర్ణీత గడువులో బియ్యాన్ని తిరిగి అప్పగించని రైస్ మిల్లర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ ధాన్యాన్ని తీసుకుని బియ్యం అప్పగించకుండా కాలయాపన చేసే మిల్లర్ల ఒత్తిళ్లకు తలొగ్గవద్దని స్పష్టం చేశారు. సప్లయ్ శాఖపై నిర్వహించిన సమీక్షలో సీఎం కీలక ఆదేశాలు జారీ చేశారు. "మిల్లర్ల బ్లాక్‌మెయిల్‌ను సహించేది లేదు. బకాయిలు చెల్లించని మిల్లులను స్వాధీనం చేసుకోవాలి" అని అధికారులను హెచ్చరించారు. స్వాధీనం చేసుకున్న మిల్లులను మహిళా సంఘాలకు అప్పగించే అవకాశాలను పరిశీలించాలని సూచించారు.

**మహిళా సంఘాలకు గోడౌన్లు..**

మహిళా సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేసే దిశగా 50 నుంచి 100 ఎకరాల విస్తీర్ణంలో గోడౌన్ల నిర్మాణానికి ప్రణాళిక రూపొందించాలని సీఎం ఆదేశించారు. అవసరమైన ప్రాంతాల్లో ఉపాధి హామీ నిధులను వినియోగించి గోడౌన్ల నిర్మాణం చేపట్టే అవకాశాలను పరిశీలించాలని సూచించారు.

**జాప్యంపై అధికారులకు హెచ్చరిక**

ప్రభుత్వానికి చేరాల్సిన బియ్యాన్ని తిరిగి అప్పగించకుండా జాప్యం చేస్తున్న మిల్లర్లపై అధికారులు కఠినంగా వ్యవహరించాలని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. కస్టమ్ మిల్లింగ్‌లో జాప్యం, బకాయిలు, ధాన్యం లెక్కల్లో అవకతవకలకు తావులేకుండా పర్యవేక్షణను మరింత పటిష్టం చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ ధాన్యాన్ని తీసుకుని బాధ్యతలను విస్మరించే మిల్లర్ల విషయంలో ఇకపై ఉపేక్ష ఉండదని సీఎం స్పష్టం చేశారు. బకాయిలు చెల్లించకుండా కాలయాపన చేస్తే మిల్లుల స్వాధీనం తప్పదనే స్పష్టమైన హెచ్చరిక జారీ చేశారు. ప్రభుత్వ ధాన్యం, ప్రజా ఆస్తుల విషయంలో నిర్లక్ష్యానికి పాల్పడితే కఠిన చర్యలు తప్పవనే సంకేతాన్ని తాజా ఆదేశాలతో ఇచ్చారు.

# విద్యార్థులతో కలిసి భోజనం చేసిన కలెక్టర్, ఎస్పీ

బాన్సువాడ, /ఆగస్టు 12/జన సంఘర్షణ):





బాన్సువాడ మండలం బోర్లం గ్రామంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలను జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్, ఎస్పీ రాజేష్‌చంద్ర బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో విద్యార్థులకు అందుతున్న విద్యాబోధన, వసతులు, భోజన సదుపాయాలు, విద్యా ప్రమాణాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా తరగతి గదులను సందర్శించిన కలెక్టర్, ఎస్పీ విద్యార్థులతో ముచ్చటిస్తూ పాఠ్యాంశాలపై వారి అవగాహనను పరీక్షించారు. చదువులో ఎదురవుతున్న సమస్యలు, పాఠశాలలో అందుతున్న సౌకర్యాలపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుతూ ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకుని ముందుకు సాగాలని సూచించారు. అనంతరం భోజనశాల, వంటగదిని పరిశీలించిన అధికారులు ఆహార నాణ్యత, పరిశుభ్రత, వంటశాల నిర్వహణపై ఆరా తీశారు. విద్యార్థులకు నాణ్యమైన, పరిశుభ్రమైన ఆహారం అందించడంలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని సంబంధిత సిబ్బందిని హెచ్చరించారు. భోజనం తయారీ, వడ్డింపు ప్రక్రియలో పరిశుభ్రత ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని ఆదేశించారు. విద్యార్థుల విద్యా ప్రగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, వారిలో ఆత్మవిశ్వాసం పెంపొందించేలా బోధన కొనసాగించాలని సూచించారు. పాఠశాలలో మౌలిక వసతులు, విద్యా ప్రమాణాలు, విద్యార్థుల భద్రత విషయంలో ఎలాంటి లోపాలు లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. అనంతరం కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్, ఎస్పీ రాజేష్‌చంద్ర విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. అధికారులతో కలిసి భోజనం చేయడం విద్యార్థుల్లో ఆనందాన్ని, ఆత్మవిశ్వాసాన్ని నింపింది. పాఠశాలలో విద్యార్థులకు మెరుగైన వసతులు, నాణ్యమైన విద్య, పరిశుభ్రమైన ఆహారం అందేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు కలెక్టర్, ఎస్పీ స్పష్టం చేశారు. ఈ తనిఖీలో బాన్సువాడ ఆర్డీఓ.. రవీందర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ గంగాధర్, ఎమ్మార్వో నరేందర్‌గౌడ్, ఎంపీడీవో ఆనంద్ తదితర అధికారులు పాల్గొన్నారు.

# నర్సాపూర్ పట్టణంలో బిజెపి మెదక్ జిల్లా అధ్యక్షుడు గౌడ్ ఆధ్వర్యంలో హర్ తిరంగా యాత్ర

- 500 అడుగుల విద్యార్థిని విద్యార్థులతో కలిసి పట్టణంలో సిగ్నల్ పాయింట్ నుండి తిరిగి మళ్లీ సిగ్నల్ పాయింట్ వరకు ఘనంగా ర్యాలీ నిర్వహించడం జరిగింది.

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 12 (జన సంఘర్షణ)







భారతీయ జనతా పార్టీ నర్సాపూర్ పట్టణ శాఖ భారతీయ జనతా పార్టీ మెదక్ జిల్లా అధ్యక్షులు వాల్దాస్ రాధా మల్లేష్ గౌడ్ అధ్వర్యంలో ముఖ్య అతిథిగా ఎబివిపి నాయకులు రంజిత్ మోహన్, భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పిలుపుమేరకు హర్ ఘర్ తిరంగ యాత్ర సందర్భంగా 500 అడుగుల జాతీయ పతకంతో విద్యార్థిని విద్యార్థులతో కలిసి పట్టణ సిగ్నల్ పాయింట్ నుండి తిరిగి మళ్ళీ సిగ్నల్ పాయింట్ వరకు ఘనంగా ర్యాలీని నిర్వహించడం జరిగింది. జిల్లా అధ్యక్షుల వారు మాట్లాడుతూ... నేడు విద్యార్థులందరూ త్రివర్ణ పతాక చేతపట్టి నర్సాపూర్ పట్టణంలో విజయవంతంగా ఈ ర్యాలీని జరుపుకోవడం ఎంతో సంతోషకరమైన విషయం ప్రధానమంత్రి నరేంద్ర మోడీ చెప్పినట్టు మనం అందరం మన ఇంటి పైన కుటుంబ సభ్యులతో జాతీయ జెండాను ఎగురవేసి సెల్ఫీ దిగి సోషల్ మీడియాలో భారత దేశం యొక్క గొప్పతనని చాటి చెప్పాల్సిన అవసరం మన అందరిది అని తెలియజేయడం జరిగింది. అదేవిధంగా ఈ ర్యాలీకి సహకరించిన విద్యార్థినీ విద్యార్థులకు టీచర్లకు ప్రెస్ రిపోర్టర్లకు పోలీస్ బృందానికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో హర్ ఘర్ తిరంగా జిల్లా కన్వీనర్ శంకర్ గౌడ్, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు నర్సాపూర్ మున్సిపల్ వైస్ చైర్మన్ భుచేష్ యాదవ్, సీనియర్ నాయకులు పంజా విజయ్ కుమార్, నర్సాపూర్ కౌన్సిలర్ నిరంజన్ దాస్, ఓబీసీ మోర్చా రాష్ట్ర నాయకులు పెద్ద రమేష్ గౌడ్, చిన్న రమేష్ గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి రంజిత్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు కాజీపేట రాజేందర్, నారాయణ రెడ్డి, బీజేపీ జిల్లా కార్యదర్శులు అశోక్ సాదుల, ఎరుకల భిక్షపతి, బాదే బాలరాజ్, జిల్లా కోశాధికారి ఆంజనేయులు గౌడ్, జిల్లా యువ మోర్చా అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, ఎస్టి మోర్చా జిల్లా అధ్యక్షులు రాములు నాయక్, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షులు జనార్ధన్, మహిళా మోర్చా అధ్యక్షురాలు మల్లిక, జిల్లా కార్యవర్గ సభ్యులు గుండం శంకర్, బిట్ల మహేష్, మండల అధ్యక్షులు నీరుడి చంద్రయ్య, నీలి నాగేష్, పెద్దపులి రవి, నాగ ప్రభు గౌడ్, నాగేందర్ రెడ్డి, నర్సాపూర్ మండల ప్రధాన కార్యదర్శిలు కోదండ రామిరెడ్డి, సంఘసాని రాజు, యువ మోర్చా జిల్లా నాయకులు ప్రేమ్ కుమార్, పోతరాజు అనిల్, రాజేష్, చందు, సాయి, చారి, వంశీ, సురేష్, గణేష్, నరేష్, మహేందర్, మనోజ్ తదితరులు పాల్గొన్నారు. జిల్లా అధికారులు రాష్ట్ర నాయకులు మండల పట్టణ అధ్యక్షులు కౌన్సిలర్లు సర్పంచులు మోర్చాల అధ్యక్షులు నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొనడం జరిగింది.

# పరిశుభ్రతకు ముందడుగు సర్పంచ్ సౌమ్య మోహన్

కామారెడ్డి జిల్లా : ఆగస్టు 12 (జన సంఘర్షణ) ప్రతినిధి



గాంధారి మండలంలోని బూర్గుల్ గ్రామంలో పరిశుద్ధ చర్యలు చేపడుతున్నట్టు సర్పంచ్ సౌమ్య మోహన్ తెలిపారు. గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో భాగంగా గ్రామంలో ఉన్న డ్రైనేజీలు మురుగు కాలువలు పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచి ఆరోగ్యవంతంగా తీర్చిదిద్దేందుకు పారిశుద్ధ్య చర్యలు నిరంతరం కొనసాగిస్తామని ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలందరూ ప్రతి ఇంటి ఆవరణలోని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతూ గ్రామ పరిశుభ్రతకు సహకరించాలని సర్పంచ్ కోరారు పలు పరిసరాలను శానిటేషన్ కార్యక్రమం నిర్వహించి డ్రైనేజీ పరిసరాలను బీచింగ్ చేయించారు. గ్రామస్థలందరూ పరిశుభ్రతకు సహకరించాలని సర్పంచ్ సౌమ్య మోహన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ వార్డు సభ్యులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# బొంపల్లి భీమ్ రావును పరామర్శించిన ప్రజాసంఘాల నాయకులు

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 12 (జన సంఘర్షణ)



భూంపల్లిలోని ప్రజా ఉద్యమ నాయకుడు భూంపల్లి భీంరావుని తన నివాసంలో పరామర్శించిన పలు ప్రజాసంఘాల నాయకులు మాల మహానాడు పోలిట్ బ్యూరో చైర్మన్ ర్యాకం శ్రీరాములు ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు సిద్ధిని రాజ మల్లయ్య టిఎంఆర్పిఎస్ మెదక్ జిల్లా అధ్యక్షుడు గరుగుల శ్రీనివాస్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బలిగారి కృష్ణ జిల్లా నాయకుల కొలుపుల నవీన్, అక్బర్ పేట భూంపల్లి మండల అధ్యక్షుడు జీడిపల్లి రవి, భూంపల్లి మాజీ సర్పంచ్ బోయ శ్రీనివాస్, మెదక్ జిల్లా నిజాంపేట ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు స్వామి, బేగంపేట నగేష్,ప్రజా సంఘాలు, ప్రజా సమికవాదులు భీంరావు, అతి తొందర కోలుకోవాలని మళ్లీ ప్రజా ఉద్యమాలలో పాల్గొనాలని ఆకాంక్షించారు.

# అక్రమ ఇసుక రవాణాపై ఆర్ఐ చర్యలు.. కేసులు నమోదు చేస్తారా?

- బొలేరో వాహనం పట్టివేత.. నామమాత్రపు జరిమానాలతో వదిలేస్తే అక్రమ రవాణా ఎలా ఆగుతుంది?

సాలూరు మండలం,/ ఆగస్టు 12:/జన సంఘర్షణ)

సాలూర మండలంలోని తగ్గెల్లి మంజీరా నది నుంచి మంగళవారం రాత్రి అక్రమంగా ఇసుక తరలిస్తున్న బొలేరో వాహనాన్ని ఆర్ఐ శంకర్ పట్టుకున్నారు. అక్రమంగా ఇసుక తరలిస్తున్న వాహనాన్ని అదుపులోకి తీసుకుని తదుపరి చర్యలకు అధికారులు సిద్ధమయ్యారు. అయితే ఇసుక అక్రమ రవాణాపై కేవలం నామమాత్రపు జరిమానాలతో సరిపెట్టకుండా, బాధ్యులపై కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. కేసులు నమోదు చేస్తారో.. లేక తూతూమంత్రంగా జరిమానా విధించి చేతులు దులుపుకుంటారో వేచి చూడాల్సిందేనని ప్రజలు అంటున్నారు.

**యథేచ్ఛగా అక్రమ రవాణా?**

మండలంలోని పలు ప్రాంతాల్లో ఇసుక అక్రమ రవాణా కొనసాగుతున్నప్పటికీ అధికారులు నిరంతర పర్యవేక్షణ చేయడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రతిరోజూ రాత్రివేళల్లో ఇసుక తరలింపు జరుగుతోందని, దీనిపై అధికారులు ప్రత్యేక నిఘా పెట్టాలని కోరుతున్నారు. అక్రమ ఇసుక రవాణా వెనుక కొందరు మాఫియా నిర్వాహకులు అధికారులను మచ్చిక చేసుకుని వ్యవహారం నడిపిస్తున్నారనే ఆరోపణలు కూడా స్థానికంగా వినిపిస్తున్నాయి. అయితే ఈ ఆరోపణలకు అధికారికంగా ఎలాంటి నిర్ధారణ లేదు.

**జిల్లా స్థాయి బృందాలతో నిఘా పెట్టాలి**

ఇసుక అక్రమ రవాణాకు పూర్తిస్థాయిలో అడ్డుకట్ట వేయాలంటే మండల అధికారులతో పాటు జిల్లా స్థాయి





ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగి ఆకస్మిక తనిఖీలు చేపట్టాలని పలువురు అభిప్రాయపడుతున్నారు. పట్టుబడిన వాహనాలపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు, పునరావృతంగా అక్రమ రవాణాకు పాల్పడుతున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.అధికారులు ఇకనైనా నిరంతర తనిఖీలు నిర్వహించి, ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేస్తారా? లేక పట్టుబడిన వాహనాలకు నామమాత్రపు జరిమానాలతోనే సరిపెడతారా? అన్నది వేచి చూడాలి.

# వరంగల్ జిల్లాలో డిజిటల్ మౌలిక వసతుల విస్తరణపై పార్లమెంట్‌లో ప్రశ్నించిన వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య

వరంగల్/ఆగస్టు 12/ జన సంఘర్షణ)



వరంగల్ జిల్లాలో గ్రామీణ, గిరిజన ప్రాంతాలకు 4జీ, 5జీ మొబైల్ సేవల విస్తరణ, నెట్‌వర్క్ బ్లాక్‌స్పాట్ల తొలగింపు, కొత్త మొబైల్ టవర్ల ఏర్పాటు తదితర అంశాలపై వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య లోక్‌సభలో కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. గత మూడేళ్లలో జిల్లాలో మొబైల్ కనెక్టివిటీ విస్తరణ స్థితి, కేంద్ర ప్రభుత్వ పథకాల కింద మంజూరై ఏర్పాటు చేసిన టవర్ల వివరాలు, నెట్‌వర్క్ సమస్యల పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలపై వివరణ కోరారు. వరంగల్ ఎంపీ డా.కడియం కావ్య అడిగిన ప్రశ్నకు కేంద్ర కమ్యూనికేషన్ల శాఖ సహాయ మంత్రి డా. పెమ్మసాని చంద్రశేఖర్ బుధవారం సమాధానమిచ్చారు. జూన్ 2026 నాటికి వరంగల్ జిల్లాలో రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియా లెక్కల ప్రకారం 218 గ్రామాలు ఉన్నాయని తెలిపారు. వీటిలో 217 గ్రామాలకు మొబైల్ కనెక్టివిటీ, 216 గ్రామాలకు 4జీ సేవలు అందుతున్నాయని వెల్లడించారు. 47 గ్రామాల్లో 5జీ సేవలు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా వరంగల్ ఎంపీ డా.కడియం కావ్య మాట్లాడుతూ.. వరంగల్ జిల్లాలో డిజిటల్ కనెక్టివిటీ మరింత బలోపేతం కావాల్సిన అవసరం ఉందని ఎంపీ డా. కడియం కావ్య అన్నారు. గ్రామీణ, మారుమూల ప్రాంతాల్లో ఒక్క గ్రామం కూడా నెట్‌వర్క్ సౌకర్యానికి దూరంగా ఉండకూడదని, 4జీతోపాటు 5జీ సేవలను కూడా విస్తరించాలని వరంగల్ ఎంపీ కోరారు. విద్య, వైద్యం, ఉపాధి, ప్రభుత్వ సేవలు, డిజిటల్ లావాదేవీలకు నాణ్యమైన మొబైల్, ఇంటర్నెట్ కనెక్టివిటీ అత్యవసరమని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాల ద్వారా అందుతున్న నిధులను సద్వినియోగం చేసుకుని వరంగల్‌లో మిగిలిన నెట్‌వర్క్ లోటుపాట్లను కూడా వేగంగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రజలకు మెరుగైన డిజిటల్ మౌలిక వసతులు కల్పించడమే నా లక్ష్యం అని వరంగల్ ఎంపీ డా.కడియం కావ్య అన్నారు.

# ప్రజల తీర్పును గౌరవించాలి.. విమర్శలు వెనక్కి తీసుకోవాలి

- ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డికి బీర్కూర్ సర్పంచ్ ధర్మతేజ సూచన
- "మంచోడు ఓడిపోయాడు.. చెడ్డోడు గెలిచాడు" అనడం సరికాదు.. ప్రజలే మంచీచెడులను నిర్ణయిస్తారు

**కామారెడ్డి బ్యూరో, ఆగస్టు 12 (జన సంఘర్షణ):**
ప్రజలు ఇచ్చిన తీర్పును ప్రతి ఒక్కరూ గౌరవించాల్సిందేనని, ప్రజల తీర్పును తప్పుపట్టే విధంగా వ్యాఖ్యలు చేయడం సరికాదని బీర్కూర్ గ్రామ సర్పంచ్ అరిగే ధర్మతేజ అన్నారు. తనపై ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించిన ఆయన బుధవారం బీర్కూర్‌లో మీడియా సమావేశం నిర్వహించి ఘాటుగా స్పందించారు. నాలుగు దశాబ్దాలుగా వివిధ పదవులు చేపట్టిన అనుభవం ఉన్న పెద్దమనిషి పోచారం శ్రీనివాస్‌రెడ్డి.. ప్రజలు ఇచ్చిన తీర్పును తప్పుపట్టడం ఎంతవరకు సమంజసమని ధర్మతేజ ప్రశ్నించారు. "మంచోడు ఓడిపోయాడు.. చెడ్డోడు గెలిచాడు" అని వ్యాఖ్యానించడం సరికాదని, ఎవరు మంచివారు.. ఎవరు చెడ్డవారు అనేది నిర్ణయించేది ప్రజలేనని స్పష్టం చేశారు. ప్రజల తీర్పును ప్రతి ఒక్కరూ శిరసావహించాల్సిందేనని అన్నారు.

**పార్టీ మారింది ఎవరు.. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టింది ఎవరు?**

బీఆర్ఎస్ బీఫామ్‌పై పోటీ చేసి ఎమ్మెల్యేగా గెలిచిన అనంతరం ప్రజల విశ్వాసాన్ని పక్కన పెట్టి కాంగ్రెస్ పార్టీలో చేరిన పోచారం శ్రీనివాస్‌రెడ్డి.. తాను ప్రాతినిధ్యం వహించిన కాలంలో ఏ గ్రామానికి ఏం చేశారో చెప్పాలని ధర్మతేజ డిమాండ్ చేశారు. వేరే పార్టీ అభ్యర్థులు గెలిచిన గ్రామాలకు అభివృద్ధి నిధులు ఇవ్వకుండా అడ్డుకుంటున్నది ఎవరో ప్రజలకు వివరించాలని ప్రశ్నించారు. బీర్కూర్‌లో సెంట్రల్ లైటింగ్ పనులను ఉద్దేశపూర్వకంగా నిలిపివేసి, ఇప్పుడు గ్రామంలో అభివృద్ధి ఆగిపోయిందని చెప్పడం ఎంతవరకు సమంజసమని నిలదీశారు. అభివృద్ధి "భ్రష్టు పట్టింది" అంటూ చేసిన వ్యాఖ్యలకు కూడా ఆయన స్పందిస్తూ.. ఏ విషయంలో అభివృద్ధి భ్రష్టు పట్టిందో స్పష్టంగా చెప్పాలని డిమాండ్ చేశారు.



**ఇసుక ధరలు పెరిగి పేదలపై భారం**

బీర్కూర్ గ్రామంలో స్థానికంగా లభించే ఇసుకను నిలిపివేసి, పక్క గ్రామాల నుంచి ఇసుక తెచ్చుకునే పరిస్థితి కల్పించారని ధర్మతేజ ఆరోపించారు. గతంలో ట్రాక్టర్ ఇసుక రూ.1,400కు లభించగా ప్రస్తుతం రూ.3 వేల నుంచి రూ.3,500 వరకు ధర పెరిగిందని, దీంతో పేద, మధ్యతరగతి ప్రజలపై తీవ్ర భారం పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.

**గృహలక్ష్మి నిధులు వెంటనే విడుదల చేయాలి**

బీర్కూర్‌లో మున్నూరు కాపు.. సామాజిక వర్గానికి చెందిన సుమారు 82 నుంచి 85 పేద కుటుంబాలకు గత ప్రభుత్వం గృహలక్ష్మి పథకం కింద అనుమతి పత్రాలు ఇచ్చిందని ధర్మతేజ తెలిపారు. ప్రభుత్వ సాయం వస్తుందనే నమ్మకంతో పలువురు అప్పులు చేసి, బంగారం తాకట్టు పెట్టి ఇళ్లు నిర్మించుకున్నారని పేర్కొన్నారు. వారికి రావాల్సిన రూ.3 లక్షలకు పైగా గృహలక్ష్మి సహాయ నిధులను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

**"పార్టీ కండువా విలువ గురించి మాట్లాడే అర్హత లేదు"**

పార్టీ కండువా, పార్టీ విధేయత గురించి తనకు సూచనలు చేసే నైతిక హక్కు పోచారం శ్రీనివాస్‌రెడ్డికి లేదని ధర్మతేజ వ్యాఖ్యానించారు. టీడీపీలో పదేళ్లు, టీఆర్ఎస్‌లో పదేళ్లు కొనసాగి, ప్రస్తుతం కాంగ్రెస్‌లో ఉన్న చరిత్ర పోచారం సొంతమని విమర్శించారు. తాను మాత్రం తాను ప్రాతినిధ్యం వహిస్తున్న పార్టీ గుర్తింపు, ఆత్మగౌరవాన్ని కాపాడుకుంటూ ముందుకు సాగుతున్నానని తెలిపారు.

**ప్రోటోకాల్ ఉల్లంఘన.. ఉపాధి హామీ నిధుల్లో పక్షపాతం**

కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీతో పాటు ప్రకాశ్‌రావు క్యాంప్ రోడ్డు నిర్మాణ పనుల ప్రారంభ కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధిగా తనకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా ప్రోటోకాల్ ఉల్లంఘించారని ధర్మతేజ ఆరోపించారు. బీర్కూర్ మండలంలోని 13 గ్రామాల్లో పోచారం వర్గానికి చెందిన వారు గెలిచిన ఆరు గ్రామాలకే ఉపాధి హామీ నిధులు కేటాయించి, మిగిలిన ఏడు గ్రామాలకు ఒక్క రూపాయి కూడా ఇవ్వకుండా పక్షపాతం చూపుతున్నారని ఆరోపించారు.

**ధర్మతేజ హెచ్చరిక....**

తనపై చేసిన అసత్య ఆరోపణలు, వ్యాఖ్యలను పోచారం శ్రీనివాస్‌రెడ్డి వెంటనే వెనక్కి తీసుకోవాలని ధర్మతేజ డిమాండ్ చేశారు. ఇకపై గ్రామాల మధ్య, ప్రజల మధ్య, పార్టీల మధ్య పక్షపాతం లేకుండా అభివృద్ధి పనులు చేపట్టాలని సూచించారు. ప్రజల తీర్పును గౌరవిస్తూ బీర్కూర్ అభివృద్ధికి సహకరించాలని, లేనిపక్షంలో ప్రజల తరఫున ప్రశ్నించాల్సి వస్తుందని సర్పంచ్ ధర్మతేజ హెచ్చరించారు.

# జైలులో చదివి.. టెన్త్‌లో సత్తా చాటిన ఖైదీలు

**నిజామాబాద్, ఆగస్టు 12/జన సంఘర్షణ):**
జైలు జీవితం అంటే శిక్ష అనుభవించడమే కాదని.. జీవితాన్ని మార్చుకునేందుకు అది ఒక అవకాశంగా మలుచుకోవచ్చని పలువురు ఖైదీలు నిరూపించారు. తెలంగాణ జైళ్ల శాఖ ఆధ్వర్యంలో జాతీయ ఓపెన్ స్కూలింగ్ సంస్థ ద్వారా నిర్వహించిన పదో తరగతి పరీక్షల్లో చర్లపల్లి, నిజామాబాద్, హైదరాబాద్ మహిళా జైళ్లకు చెందిన 78 మంది ఖైదీలు ఉత్తీర్ణత సాధించారు. మొత్తం 108 మంది ఖైదీలు పరీక్షలకు నమోదు చేసుకోగా.. చర్లపల్లి జైలు నుంచి 56 మంది, నిజామాబాద్ జైలు నుంచి 15 మంది, హైదరాబాద్ మహిళా జైలు నుంచి ఏడుగురు విజయవంతంగా పదో తరగతి పూర్తి చేశారు. జైలు గోడల మధ్య ఉన్నప్పటికీ చదువుపై ఆసక్తి పెంచుకుని పట్టుదలతో పరీక్షలు రాసి విజయం సాధించడం అభినందనీయమని అధికారులు




పేర్కొన్నారు. ఉత్తీర్ణత సాధించిన ఖైదీలను జైళ్ల శాఖ డైరెక్టర్ జనరల్ డాక్టర్ సౌమ్య మిశ్రా బుధవారం ప్రత్యేకంగా అభినందించారు. శిక్షా కాలాన్ని వృథా చేయకుండా విద్యను అభ్యసించడం ద్వారా ఖైదీలు తమ భవిష్యత్తుకు బలమైన పునాది వేసుకున్నారని ఆమె పేర్కొన్నారు.

**విద్యతోనే జీవితంలో కొత్త మార్పు**

జైలు నుంచి బయటకు వచ్చిన అనంతరం సమాజంలో గౌరవప్రదంగా జీవించేందుకు విద్య ఎంతో ఉపయోగపడుతుందని అధికారులు తెలిపారు. విద్య ద్వారా ఆత్మవిశ్వాసం పెంపొందడంతో పాటు ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకునే అవకాశం ఉంటుందని చెప్పారు. ఈ ఖైదీల విజయం.. తప్పు చేసిన ప్రతి జీవితానికి మార్పు సాధ్యమేనని, పట్టుదల ఉంటే ఎక్కడ ఉన్నా లక్ష్యాన్ని చేరుకోవచ్చని చెప్పే స్ఫూర్తిదాయక సందేశంగా నిలుస్తోంది. జైలు గోడల మధ్య చదువుకుని పదో తరగతి ఉత్తీర్ణత సాధించిన వీరి విజయగాథలు ఇతర ఖైదీలకు కూడా ఆదర్శంగా నిలవనున్నాయి.

# కేజీబీవీ, రెసిడెన్షియల్ స్కూళ్లను సందర్శించిన కలెక్టర్

- బాలికలకు నాణ్యమైన పౌష్టికాహారం అందించాలి.. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలి
- ముురుగు, వర్షపు నీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టాలి: కలెక్టర్ భవేష్ మిశ్రా

**నిజామాబాద్ బ్యూరో: /ఆగస్టు 12/(జన సంఘర్షణ)**
నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ మైనార్టీ బాలికల విద్యాలయం (కేజీబీవీ), తెలంగాణ రెసిడెన్షియల్ స్కూల్/జూనియర్ కళాశాలలను జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల పరిసరాలు, కిచెన్, స్టోర్ రూమ్, తరగతి గదులను పరిశీలించారు. కేజీబీవీ పరిసరాలు పిచ్చి మొక్కలతో నిండి అపరిశుభ్రంగా ఉండటాన్ని గమనించిన కలెక్టర్ వెంటనే శుభ్రం చేయించాలని, వర్షపు నీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. పాఠశాలలో విశాలమైన ఖాళీ స్థలం అందుబాటులో ఉన్నందున అన్ని వసతులతో కూడిన క్రీడా మైదానంగా అభివృద్ధి చేయాలని సూచించారు. మధ్యాహ్న భోజనం నాణ్యతను పరిశీలించిన కలెక్టర్.. మెనూ వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం బాలికలకు నాణ్యమైన పౌష్టికాహారం అందించాలని ఆదేశించారు. పాఠశాల ప్రధాన ద్వారం వద్ద అందరికీ కనిపించేలా మెనూ బోర్డును ఏర్పాటు చేయాలని సూచించారు. కేజీబీవీలో బాలికల సంఖ్య తక్కువగా ఉండటాన్ని గమనించిన కలెక్టర్, ఇతర విద్యార్థినులకు ప్రవేశాలు కల్పించే అంశంపై రాష్ట్రస్థాయి అధికారులతో మాట్లాడతానని తెలిపారు. పాఠశాలలో కొనసాగుతున్న ప్రహరీ గోడ నిర్మాణ పనుల నాణ్యతను పరిశీలించారు. ఆర్‌ఓ వాటర్ ప్లాంట్ నిరుపయోగంగా ఉండటంపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని కేజీబీవీలలో ఆర్‌ఓ ప్లాంట్లు, సోలార్ హీటర్లను వినియోగంలోకి తీసుకురావడానికి అవసరమైన



మరమ్మతులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. రెసిడెన్షియల్ కళాశాల ఆవరణలో వరి ధాన్యంతో పాటు వివిధ రకాల కూరగాయలను సాగు చేస్తుండటాన్ని గమనించిన కలెక్టర్ నిర్వాహకులను అభినందించారు. బాలికల ఆరోగ్య పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. అనంతరం పదో తరగతి తరగతి గదులను సందర్శించిన కలెక్టర్.. విద్యార్థినులకు ఆంగ్లం సబ్జెక్టులో పాఠాలు బోధించారు. విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగి వారి అభ్యాసన సామర్థ్యాన్ని పరిశీలించారు. తన వెంట తీసుకువచ్చిన బహుమతులను విద్యార్థినులకు అందజేశారు. చక్కగా చదువుకొని తల్లిదండ్రులకు, గురువులకు మంచి పేరు



తీసుకురావాలని ప్రోత్సహించారు. కలెక్టర్ వెంట స్థానిక తహసీల్దార్ దత్తాత్రి, ఎంఈఓ గాలప్ప, కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ దీపిక, రెసిడెన్షియల్ స్కూల్ సహాయ ప్రిన్సిపాల్ సురేఖ తదితరులు ఉన్నారు.

## కాంగ్రెస్‌లో చేరిన జనగామ గ్రామ ఉపసర్పంచ్ శ్యామ్ రావు

- పార్టీ కండువా కప్పి ఆహ్వానించిన ఎమ్మెల్యే మదన్ మోహన్

**కామారెడ్డి జిల్లా : ఆగస్టు 12. సదాశివ నగర్ మండల్ (జన సంఘర్షణ) ప్రతినిధి**



ఎల్లారెడ్డి నియోజకవర్గంలోని జనగామ గ్రామ ఉపసర్పంచ్ శ్యామ్, వార్డు సభ్యులు కవిత జైపాల్, చాకలి ప్రణీత్, అంబీర్ ఆనంద్ రావు ఎమ్మెల్యే మదన్ మోహన్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మదన్ మోహన్ వారికి కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, ఇతర సీనియర్ నాయకులు పాల్గొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్లు, కొత్త రేషన్ కార్డులు, సన్న బియ్యం పంపిణీ, ఉచిత విద్యుత్ వంటి అనేక సంక్షేమ పథకాలు ప్రజలకు నేరుగా ప్రయోజనం చేకూరుస్తున్నాయని పార్టీలో చేరిన నాయకులు తెలిపారు. ప్రజా సంక్షేమంతో పాటు గ్రామాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం, ఎమ్మెల్యే మదన్ మోహన్ ఇస్తున్న ప్రాధాన్యత తమను ఆకర్షించిందని పేర్కొన్నారు. ఎమ్మెల్యే మదన్ మోహన్ చొరవతో జనగాం గ్రామంలో రూ.15 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణం, రూ.10 లక్షలతో డ్రైనేజీ నిర్మాణం చేపట్టడంతో పాటు పలు అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతున్నాయని తెలిపారు. గ్రామంలో మౌలిక వసతుల కల్పనకు ఎమ్మెల్యే చేస్తున్న కృషి, ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాలతో స్ఫూర్తి పొంది కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు వారు వెల్లడించారు. జనగాం గ్రామ అభివృద్ధి కోసం ఎమ్మెల్యే మదన్ మోహన్ నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీతో కలిసి పనిచేస్తామని, ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తామని కొత్తగా పార్టీలో చేరిన నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, నల్ల మైపాల్ రెడ్డి మరియు సీనియర్ నాయకులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## అధికార పార్టీలో చేరిన మోడేగాం సర్పంచ్ కౌడెల్లి గంగాధర్

- ఆహ్వానం పలికిన ఎమ్మెల్యే మదన్మోహన్

**కామారెడ్డి జిల్లా : ఆగస్టు 12(జన సంఘర్షణ) ప్రతినిధి**



సదాశివ నగర్ మండలంలోని మోడేగాం గ్రామ సర్పంచ్ కౌడెల్లి గంగాధర్, జువ్వాడ బిక్షపతి దాసరి భాస్కర్ పెద్దరాజయ్య జువ్వల శ్రీనివాస్ బెస్త రాములు తదితరులు కాంగ్రెస్ పార్టీలో చేరిక. గ్రామ అభివృద్ధికి ఎల్లవేళలా ముందు ఉంటామని ఎమ్మెల్యే మదన్మోహన్ అభివృద్ధి పనులకు ఆకర్షితులమై వాటిలో చేరుతున్నట్టు వారు తెలిపారు గ్రామాల్లో ప్రభుత్వ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు ప్రత్యక్షంగా ప్రయోజనం చేకూరు వస్తున్నాయని నియోజకవర్గంలోని జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు ప్రజల్లో విశ్వాసాన్ని పెంచుతున్నాయని ముఖ్యంగా ఇందిరమ్మ ఇల్లు కొత్త రేషన్ కార్డులు సన్న బియ్యం పంపిణీ ఉచిత విద్యుత్ ఉచిత కరెంట్ వంటి అనేక సంక్షేమ కార్యక్రమాలు పేద మధ్యతరగతి కుటుంబాలకు ఎంతో ఉపయోగకరంగా మారాయని అదేవిధంగా ఎమ్మెల్యే మదన్మోహన్ చొరవతో మోడెగాం గ్రామంలో రూ 35 లక్షలతో సిసి రోడ్లు, 10 లక్షల తో స్వయం సహాయక సంఘాల ఎస్ హెచ్ జి భవనానికి నిధులు మంజూరుతో పాటు పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం తమను ఆకర్షించిందని గ్రామాల అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పిస్తూ ఎమ్మెల్యే మదన్మోహన్ చేస్తున్న కృషి కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో కాంగ్రెస్ పార్టీకి ప్రజల మద్దతు మరింత పెరుగుతోందని తెలిపారు. మోడేగాం గ్రామ అభివృద్ధి కోసం ఎమ్మెల్యే మదన్మోహన్ నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీతో కలిసి పని చేస్తామని కొత్తగా పార్టీలో చేరిన నాయకులు తెలిపారు ఈ కార్యక్రమంలో సదాశివ నగర్ మండల్ అధ్యక్షులు మైపాల్ రెడ్డి గ్రామ ఉపసర్పంచ్ గ్రామ పార్టీ అధ్యక్షులు సీనియర్ నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## ఎరువుల యాప్ పైన అవగాహన

- వివరిస్తున్న ఏవో ప్రజాపతి

**కామారెడ్డి జిల్లా : ఆగస్టు 12(జన సంఘర్షణ) ప్రతినిధి**



సదాశివ నగర్ మండలంలోని తిమ్మాజి వాడి గ్రామంలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎరువుల యాప్ వాడకం గురించి ఏవో ప్రజాపతి రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏ ఈ ఓం, గ్రామ సర్పంచ్ భవాని సాయిలు, ఉప సర్పంచ్ జే రవీందర్, వార్డు సభ్యులు జి శ్రీనివాస్, ఏఎంసి డైరెక్టర్ జె అశోక్, గ్రామ ప్రజలు రైతులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# బాన్సువాడ రాజకీయాల్లో దిగజారుతున్న విలువలు..

- **జెన్-జెడ్ రంగప్రవేశం - ఇక ప్రతి అక్రమ దందాపై ప్రజల నిఘా!**

హైదరాబాద్ (ప్రతినిధి/ఆగస్టు 12/జన సంఘర్షణ)

ప్రజా సేవ, సిద్ధాంతాలు, విలువలకు ఒకప్పుడు ప్రత్యేక గుర్తింపు ఉన్న బాన్సువాడ నియోజకవర్గ రాజకీయాల్లో ప్రస్తుతం చోటుచేసుకుంటున్న పరిణామాలు ప్రజలను ఆందోళనకు గురిచేస్తున్నాయి. రాజకీయాలు ప్రజల కోసం కాకుండా కొందరి వ్యక్తిగత ప్రయోజనాలకు వేదికగా మారుతున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి.

**చిల్లర రాజకీయాలకు పెద్దపీట ఎందుకు?**

దశాబ్దాలుగా పార్టీ కోసం కష్టపడిన నిజమైన కార్యకర్తలను పక్కనబెట్టి.. డబ్బు, పలుకుబడి, వ్యక్తిగత ప్రయోజనాలతో ముందుకు వచ్చిన కొందరికి ప్రాధాన్యత లభిస్తోందనే ఆరోపణలు ఉన్నాయి. నిన్నటి వరకు రాజకీయాలకు దూరంగా ఉన్న వ్యక్తులు ఒక్కసారిగా కీలక నేతలుగా అవతరించడం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. జూదం, క్రికెట్ బెట్టింగ్‌లు, అక్రమ వ్యాపారాలు వంటి కార్యకలాపాలతో సంబంధాలున్నాయని ఆరోపణలు ఎదుర్కొంటున్న కొందరు వ్యక్తులు రాజకీయాల్లోకి ప్రవేశించి తమ ఆర్థిక బలాన్ని రాజకీయ బలంగా మార్చుకుంటున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

**పార్టీలు మారినా.. దందాలు మారడం లేదా?**

బీఆర్ఎస్, కాంగ్రెస్ వంటి ప్రధాన రాజకీయ పార్టీల్లో సిద్ధాంతపరంగా విభేదాలు ఉన్నప్పటికీ.. కొందరు వ్యక్తులు మాత్రం అధికారంలో ఉన్న పార్టీ నేతలతో సన్నిహితంగా ఉంటూ తమ ప్రయోజనాలను కాపాడుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అధికారం మారితే రాజకీయ రంగు మార్చడం.. అవసరానికి అనుగుణంగా ఇరువైపులా సంబంధాలు కొనసాగించడం వంటి వ్యవహారాలు ప్రజాస్వామ్య విలువలను దెబ్బతీస్తున్నాయని రాజకీయ పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు.

**సీనియర్ కార్యకర్తలకు అవమానమేనా?**

పార్టీల కోసం ఏళ్ల తరబడి పనిచేసిన సీనియర్ నాయకులు, కార్యకర్తలను పక్కనపెట్టి.. కొత్తగా వచ్చిన వారికి అధిక ప్రాధాన్యత ఇవ్వడం పట్ల కేడర్‌లో అసంతృప్తి వ్యక్తమవుతోంది.
అభిమానం పేరుతో జరిగే కార్యక్రమాలు, వ్యక్తిగత వేడుకలు రాజకీయ ప్రాధాన్యతకు కొలమానాలుగా మారితే.. ప్రజల సమస్యలు, అభివృద్ధి అంశాలు ఎక్కడికి పోతాయన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.




**ప్రకృతి సంపదపై ఎవరి కన్ను?**

బాన్సువాడ నియోజకవర్గంలోని అటవీ ప్రాంతాలు, గుట్టలు, మట్టి, ఇసుక వంటి సహజ వనరులపై అక్రమ తవ్వకాలు జరుగుతున్నాయనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. మొరం, ఇసుక అక్రమ రవాణాతో ప్రకృతి సంపద దెబ్బతింటున్నా సంబంధిత అధికారులు కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని ప్రజలు కోరుతున్నారు. అయితే ఇలాంటి ఆరోపణలు వాస్తవమైతే వాటిపై అధికారులు సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి. ఆరోపణలు ఎదుర్కొంటున్న ప్రతి వ్యక్తిని ముందుగానే దోషిగా చిత్రీకరించడం కూడా సరికాదు.

**బాన్సువాడకు కావాల్సింది మాఫియా రాజకీయాలు కాదు.. ప్రజా రాజకీయాలు**

బాన్సువాడ, బీర్కూర్, వర్ని, పోతంగల్, కోటగిరి తదితర ప్రాంతాల్లో రాజకీయాలు వ్యక్తిగత ప్రయోజనాలకు కాకుండా ప్రజా సమస్యల పరిష్కారానికి కేంద్రంగా మారాలని ప్రజలు కోరుతున్నారు. రాజకీయ నాయకుడి స్థాయి డబ్బుతో కాదు.. ప్రజల కోసం చేసిన పనితో నిర్ణయించబడాలి. పదవులు, హోదాలు, వ్యక్తిగత సంపద ఆధారంగా కాకుండా ప్రజా సేవ, నిబద్ధత, నిజాయితీ, రాజ్యాంగ విలువల ఆధారంగా నాయకత్వాన్ని ఎన్నుకోవాల్సిన బాధ్యత ప్రజలపైనే ఉంది.

**జెన్-జెడ్ ఇక చూస్తూ ఊరుకోదు!**

ఈ పరిస్థితుల్లో యువత రాజకీయాలపై ప్రశ్నించే గొంతుకగా ముందుకు రావాల్సిన సమయం వచ్చింది. ముఖ్యంగా జెన్-జెడ్ యువత సోషల్ మీడియా, ప్రజా వేదికలు, సమాచార హక్కు వంటి ప్రజాస్వామ్య మార్గాలను ఉపయోగించి అక్రమాలు జరిగితే వాటిపై ఆధారాలతో ప్రశ్నించాలి.

**అయితే ఆరోపణలు కాదు.. ఆధారాలే ఆయుధాలు.**

ఎవరిపై ఆరోపణలు చేసినా ఆధారాలు లేకుండా వ్యక్తిగత దూషణలకు దిగకుండా.. చట్టబద్ధమైన మార్గాల్లో నిజానిజాలను ప్రజల ముందుకు తీసుకురావాలి. జెన్-జెడ్ అంటే కేవలం ఉరకలెత్తే యువత కాదు. మన పూర్వీకులను, సీనియర్లను గౌరవిస్తూ.. వారి అనుభవాలను స్వీకరించి.. ఆధునిక ఆలోచనలతో మంచి సమాజ నిర్మాణానికి కృషి చేసే తరం.
ఆ మార్పుకు బాన్సువాడ నుంచే నాంది పలకాలన్నదే ఈ పిలుపు. రాజకీయాలు ఎవరి వ్యక్తిగత ఆస్తి కావు. ప్రజాస్వామ్యం ఎవరి జేబులో ఉండదు....ప్రజలే అంతిమ నిర్ణేతలు.
ఇకపై జెండాలు మారినా.. పేర్లు మారినా.. ఆరోపణలు ఎదుర్కొంటున్న వారి వ్యవహారాలను ఆధారాలతో ప్రశ్నించడం, నిజానిజాలను ప్రజల ముందుంచడం కొనసాగాలి.
ప్రజలు ప్రశ్నిస్తేనే నాయకులు జవాబుదారీగా ఉంటారు. యువత నిలబడితేనే రాజకీయాల్లో మార్పు సాధ్యమవుతుంది.
గమనిక:... ఈ కథనంలో ప్రస్తావించిన అక్రమాలు, ఆరోపణలు సంబంధిత వ్యక్తులు/సంస్థలపై నిర్ధారణ పొందిన నేరాలుగా కాకుండా స్థానికంగా వినిపిస్తున్న ఆరోపణలు, ప్రజల్లో వ్యక్తమవుతున్న విమర్శలుగా మాత్రమే పరిగణించాలి. వాస్తవ నిర్ధారణకు అధికారిక దర్యాప్తు, ఆధారాలు అవసరం.

# హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు

- **నిందితుడికి జీవిత ఖైదుతో పాటు రూ.2,000 జరిమాన.**
- **శిక్ష పడేలా కృషి చేసిన పోలీసు సిబ్బందిని అభినందించిన జిల్లా ఎస్పీడి.వి. శ్రీనివాసరావు.**

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 12 (జన సంఘర్షణ)

భార్యతో చనువుగా ఉండడం చూసి సహచర కూలీని కర్రతో కొట్టి హత్య చేసిన కేసులో నిందితుడికి జీవిత ఖైదుతో పాటు రూ.2,000 జరిమానా విధిస్తూ ప్రధాన న్యాయమూర్తి నీలిమ తీర్పు వెలువరించినట్లు మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు తెలిపారు. కేసు వివరాల ప్రకారం బిట్టు కుమార్ (22) తన భార్య పూజా కుమారి,పిల్లలతో కలిసి కళకల్ గ్రామంలో శ్రీరామ్ పందరి నిర్మిస్తున్న ఇంటి వద్ద కూలీ పనులు చేస్తూ అదే ఇంటిలో నివాసం ఉంటున్నాడు.అదే ఇంటిలో వీరికంటే ముందుగా మేస్త్రీ పనులు చేస్తూ ప్రమోద్ పాశ్వాన్ (43) నివాసం ఉంటున్నాడు.ప్రమోద్ పాశ్వాన్ తన భార్యతో చనువుగా ఉండటాన్ని గమనించిన బిట్టు కుమార్, అతడిని రెండు మూడు సార్లు హెచ్చరించాడు. మరోసారి ఈ విధంగా ప్రవర్తిస్తే చంపాలనినిర్ణహించుకున్నాడు. ఈ క్రమంలో 16.11.2024న సాయంత్రం బిట్టు కుమార్, ప్రమోద్ పాశ్వాన్ సరుకులు తీసుకురావడానికి బయటకు వెళ్లి రాత్రి సుమారు 9 గంటల సమయంలో నివాసం ఉంటున్న ఇంటికి తిరిగి వచ్చారు. బిట్టు కుమార్ సరుకులను తన భార్యకు ఇచ్చి బయటకు వెళ్లి తిరిగి వచ్చేసరికి ప్రమోద్ పాశ్వాన్ తన భార్య నడుముపై చేయి వేసి ఉండటాన్ని చూశాడు. దీంతో ఆగ్రహించిన బిట్టు కుమార్, ప్రమోద్ పాశ్వాన్‌ను ఎందుకు అలా చేస్తున్నావని ప్రశ్నించగా,తన ఇష్టమని, తనను ఎందుకు అడుగుతున్నావంటూ ప్రమోద్ పాశ్వాన్ దురుసుగా సమాధానం ఇచ్చాడు. అనంతరం బిట్టు కుమార్‌ను తోసివేశాడు.దీంతో తీవ్ర ఆగ్రహానికి గురైన బిట్టు కుమార్ మంచంపై ఉన్న కర్రతో ప్రమోద్ పాశ్వాన్‌పై దాడి చేసి హత్య చేశాడు. అనంతరం అక్కడి నుంచి పారిపోయి పటాన్‌చెరువుకు వెళ్లాడు. ఈ ఘటనపై మనోహరాబాద్ ఎస్ఐ సుభాష్ గౌడ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.అప్పటి కేసు దర్యాప్తు అధికారి సీఐ రంగకృష్ణ పూర్తి సాక్ష్యాధారాలను సేకరించి కోర్టులో ఛార్జ్‌షీట్ దాఖలు చేశారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ వెంకటేష్ బలమైన వాదనలు వినిపించారు.పోలీసులు సమర్పించిన పూర్తి సాక్ష్యాధారాలను పరిశీలించిన ప్రధాన న్యాయమూర్తి నీలిమ, నిందితుడు బిట్టు కుమార్‌ను దోషిగా నిర్ధారించి జీవిత ఖైదుతో పాటు రూ.2,000 జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారు.ఈ కేసులో కోర్టు లైజనింగ్ అధికారులు ఎస్ఐ విఠల్,కానిస్టేబుల్ రవీందర్ గౌడ్,సీడీఓ మహిపాల్




రెడ్డి సహకరించారు.నిందితుడికి శిక్ష పడేలా సమర్థవంతంగా దర్యాప్తు చేసి, పూర్తి సాక్ష్యాధారాలను కోర్టులో సమర్పించిన దర్యాప్తు అధికారులు,కోర్టు లైజనింగ్ అధికారులు, సాక్ష్యాధారాల సేకరణలో సహకరించిన పోలీసు సిబ్బందిని జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు అభినందించారు.

# అమరుల యాదిలో గీతన్నల చైతన్య బస్ యాత్ర

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 12 (జన సంఘర్షణ)

కల్లుగీత కార్మికుల సంక్షేమం, ఉపాధి భద్రత, వృత్తి ఆధునీకరణే ధ్యేయంగా రాష్ట్రవ్యాప్తంగా సాగుతున్న 'గీతన్నల చైతన్య యాత్ర'కు రామాయంపేటలో అపూర్వ స్పందన లభించింది. కేజీకేఎస్ (కేజీ కేఎస్) ఆధ్వర్యంలో మానుకోట నుండి హైదరాబాద్ ట్యాంక్‌బండ్ వరకు చేపట్టిన ఈ చారిత్రాత్మక బస్సు యాత్రకు మద్దతుగా బుధవారం రోజున రామాయంపేటలోని స్థానిక రేణుక మాత ఆలయంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో సమరసత సమావేశం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర అధ్యక్షులు మేకపోతుల రమణ,రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ వెంకటేశ్వర్లు హాజరై ప్రసంగించారు. రామాయంపేట పట్టణ గౌడ సంఘం అధ్యక్షుడు పల్లె శ్రీనివాస్ గౌడ్, ఉపాధ్యక్షుడు కన్నపురం కృష్ణ గౌడ్ మరియు గౌడ సంఘ సభ్యులు భారీ సంఖ్యలో పాల్గొన్న ఈ సభలో పలు కీలక అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. రాష్ట్రంలో దాదాపు 5 లక్షల గీత కార్మిక కుటుంబాలు ప్రకృతి ప్రసాదించిన కోటి తాటి,ఈత చెట్లపైనే ఆధారపడి జీవిస్తున్నాయని గుర్తుచేశారు. మారుతున్న కాలానికి అనుగుణంగా వృత్తిలో ఆధునిక మార్పులు తీసుకురావాలని, ప్రమాదాల నివారణకు ప్రభుత్వం తగిన రక్షణ చర్యలు చేపట్టాలని కోరారు.కామ్రేడ్ ధర్మభిక్షం, ఎస్.ఆర్. దాట్ల లాంటి త్యాగధనుల ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.

**సమావేశంలో మైదానం చేసిన ప్రధాన డిమాండ్లు:**

ఎన్నికల హామీలు: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రణాళికలో గీత కార్మికులకు ఇచ్చిన ప్రతి హామీని తక్షణమే నెరవేర్చాలి.
పెన్షన్ ఞ ఎక్స్‌గ్రేషియా. పెన్షన్ రూ.4,000కు, ప్రమాద ఎక్స్‌గ్రేషియా రూ.10 లక్షలకు పెంచి, రాష్ట్రంలో ఎక్కడ ప్రమాదం జరిగినా వర్తింపజేయాలి.
వయోపరిమితి పెన్షన్: జీవో ప్రకారం 50 సంవత్సరాలు దాటిన గీత కార్మికులందరికీ వెంటనే పెన్షన్ మంజూరు చేయాలి.
బకాయిల విడుదల: పెండింగ్‌లో ఉన్న రూ.20 కోట్ల ఎక్స్‌గ్రేషియా నిధులను వెంటనే బాధితులకు చెల్లించాలి.



వృక్ష సంరక్షణ: రాష్ట్రంలోని కోటి తాటి, ఈత చెట్లకు నంబర్లు వేసి రక్షించాలి; చెట్లను నరికివేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి.ఈ నెల 18న హైదరాబాద్ ట్యాంక్ బండ్ వద్ద ముగిసే ఈ మహోద్యమ యాత్రను గీత కార్మికులందరూ ఏకమై జయప్రదం చేయాలని నాయకులు విజ్ఞప్తి చేశారు.

## ప్రభుత్వ ఆస్పత్రిలో దారుణం.. మరుగుదొడ్డిలో శిశువు మృతదేహం

సదాశివపేట, /ఆగస్టు 12:/జన సంఘర్షణ)



సంగారెడ్డి జిల్లా సదాశివపేట ప్రభుత్వ ఆస్పత్రిలో దిగ్భ్రాంతికర ఘటన వెలుగులోకి వచ్చింది. ఆస్పత్రి మరుగుదొడ్డిలో గుర్తుతెలియని శిశువు మృతదేహం లభ్యమవడం కలకలం రేపింది. ఈ ఘటన ఈ నెల 7న చోటుచేసుకున్నప్పటికీ.. నాలుగు రోజుల తర్వాత విషయం వెలుగులోకి రావడం పలు అనుమానాలకు తావిస్తోంది. మరుగుదొడ్డిలో శిశువు మృతదేహాన్ని గుర్తించిన డ్యూటీ డాక్టర్ అదే రోజు సదాశివపేట పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. పోలీసులు కేసు నమోదు చేసి ఘటనపై దర్యాప్తు చేపట్టినట్లు తెలుస్తోంది. అయితే ఈ విషయాన్ని గోప్యంగా ఉంచడంపై కూడా చర్చ జరుగుతోంది. శిశువు మృతదేహం ఆస్పత్రి మరుగుదొడ్డిలోకి ఎలా వచ్చింది? ఎవరు అక్కడ వదిలి వెళ్లారు? శిశువు జననం ఎక్కడ జరిగింది? ఈ ఘటనకు ఆస్పత్రిలోని సిబ్బందికి లేదా ఇతరులకు ఏమైనా సంబంధం ఉందా? అనే కోణాల్లో పోలీసులు విచారణ కొనసాగిస్తున్నట్లు సమాచారం.

**అధికారుల నిర్లక్ష్యంపై ప్రశ్నలు**

ప్రభుత్వ ఆస్పత్రిలో ఇలాంటి ఘటన చోటుచేసుకోవడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. ఆస్పత్రిలో భద్రత, పర్యవేక్షణ వ్యవస్థ ఎలా ఉందన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఘటన జరిగిన వెంటనే పూర్తి వివరాలను ఉన్నతాధికారులకు తెలియజేసి, బాధ్యులపై చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. అధికారులు వెంటనే స్పందించి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని, ఆస్పత్రి భద్రతా వ్యవస్థపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులెవరైనా ఉంటే కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## కూకట్‌పల్లి డీసీపీ రితిరాజ్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన టిడబ్ల్యూ జెఎఫ్ యూనియన్ నాయకులు

- **నూతన కార్యవర్గ సభ్యులను అభినందించిన డీసీపీ.**

హైదరాబాద్ సిటీ, మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా ప్రతినిధి అంజిబాబు నాగుల, ఆగస్టు12 (జన సంఘర్షణ):



కూకట్పల్లి జోన్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ (ఐజూ) రితీరాజ్ ను తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ యూనియన్ మేడ్చల్ జిల్లా అధ్యక్షులు కట్టెల మల్లేశం, జిల్లా ప్రధాన కార్యదర్శి అశోక్, కూకట్పల్లి అధ్యక్షులు ఎర్ర యాకయ్య మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కూకట్‌పల్లి డీసీపీ రితిరాజ్ మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయంగా పని చేస్తామని, ఫ్రెండ్లీ పోలీసింగ్ అమలు చేస్తూనే చట్టాన్ని ఉల్లంఘించే వారిపట్ల కఠినంగా వ్యవహరిస్తామని తెలిపారు. నిషేధిత గుట్కా, గంజాయి విక్రయాలను అరికడతామని , దానితో పాటు మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించిన, ఈ వ్ టీజింగ్ కు పాల్పడే వారి పట్ల కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అదేవిధంగా ఆపద సమయంలో డయల్ 112 నెంబర్ కు ఫోన్ చేసి పోలీసుల సహాయాన్ని పొందాలని ఎలాంటి సమస్య వచ్చినా వెంటనే పోలీసులకు సమాచారం అందజేయాలని డిసిపి మాట్లాడారు. ఈ సందర్భంగా టిడబ్ల్యూ జెఎఫ్ కూకట్పల్లి అధ్యక్షులు ఎర్ర యాకయ్య మాట్లాడుతూ కూకట్‌పల్లి డీసీపీ రితిరాజ్ ప్రస్తుతం తెలంగాణ పోలీస్ శాఖలో కఠినంగా విధులు నిర్వర్తించే అధికారిణిగా గుర్తింపు పొందారాని, ఆమె స్వస్థలం బీహార్ రాష్ట్రం పాట్నాలో పెరిగిన రితిరాజ్ ఢిల్లీలోని నేషనల్ లా యూనివర్సిటీ నుంచి న్యాయశాస్త్రంలో పట్టా పొందారు. 2018 బ్యాచ్‌కు చెందిన ఐపీఎస్ అధికారిణి అయిన రితిరాజ్ తెలంగాణ కేడర్‌కు ఎంపికయ్యారు. హైదరాబాద్‌లోని నేషనల్ పోలీస్ అకాడమీలో శిక్షణ పూర్తి చేసిన తర్వాత పలు కీలక బాధ్యతలు నిర్వర్తించారు. జోగులాంబ గద్వాల జిల్లా ఎస్పీగా పనిచేసిన సమయంలో ఎన్నికల సమయంలో శాంతిభద్రతల నిర్వహణలో ఆమె కీలక పాత్ర పోషించారాని, పోలీసు సంక్షేమ కార్యక్రమాల్లో కూడా చురుకుగా వ్యవహరించారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కూకట్పల్లి టి డబ్ల్యూ జె ఎఫ్ ప్రధాన కార్యదర్శి నాగుల అంజిబాబు ( జనరల్ సెక్రటరీ), ఉపాధ్యక్షులు బొమ్మ గోపి, కోశాధికారి మహమ్మద్ షబ్బీర్, కార్యవర్గ సభ్యులు శ్యాంసుందర్, నవీన్ కుమార్, సైదులు, నాగరాజు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## మెదక్ మున్సిపల్ బీఆర్ఎస్ కౌన్సిలర్ల కీలక సమావేశం

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 12 (జన సంఘర్షణ)



మెదక్ కొత్త పాలకవర్గం ఏర్పడి ఆరు నెలలు గడిచినా మున్సిపల్ పరిధిలో ఆశించిన స్థాయిలో అభివృద్ధి పనులు జరగడం లేదని బీఆర్ఎస్ కౌన్సిలర్లు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారులు పలుమార్లు దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం చూపడం లేదని వారు పేర్కొన్నారు. 9వ వార్డు కౌన్సిలర్ జుబేర్ అహ్మద్ వార్డ్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో మెదక్‌లోని వివిధ వార్డుల సమస్యలపై కౌన్సిలర్లు చర్చించారు. ముఖ్యంగా రోడ్లు గుంతలమయంగా మారడం, కల్వర్టులు దెబ్బతినడం, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడటం వంటి సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అలాగే మెదక్ పట్టణంలో వీధికుక్కల సంఖ్య రోజురోజుకూ పెరుగుతున్నప్పటికీ అధికారులు ఏమాత్రం స్పందించడం లేదని కౌన్సిలర్లు ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా పాఠశాలలకు వెళ్లే చిన్నారులు, వృద్ధులు, మహిళలు వీధికుక్కల కారణంగా భయాందోళనకు గురవుతున్నారని,కుక్కలు గుంపులుగా తిరుగుతూ ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నాయని తెలిపారు.ప్రజల భద్రతకు సంబంధించిన సమస్యలపై కూడా అధికారులు చలనం లేకుండా వ్యవహరించడం బాధాకరమని,వెంటనే వీధికుక్కల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని కోరారు. రోడ్లు,కల్వర్టులు, పారిశుద్ధ్యం,వీధికుక్కలు తదితర సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఆరు నెలలు గడిచినా కనీస మౌలిక సదుపాయాల సమస్యలు పరిష్కారం కాకపోవడంపై ప్రజల్లో అసంతృప్తి నెలకొందని, అధికారులు ఇకనైనా స్పందించి అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని బీఆర్ఎస్ కౌన్సిలర్లు కోరారు.

జన సంఘర్షణ
మా లక్ష్యం సామాన్యుని పక్షం
తెలుగు దినపత్రిక
గురువారం
13 ఆగస్టు 2026

# చర్లలో డిగ్రీ కాలేజీ మంజూరు చేయండి

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, చర్ల మండలం, ఆగస్టు 12(జనసంఘర్షణ):**



చర్ల మండలంలో డిగ్రీ కాలేజ్ ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ కి వినతి పత్రం ఇచ్చిన పిడిఎస్ యు, పి వై ఎల్,పూర్తి ఏజెన్సీలో మారుమూల అడవిలో ఉన్నటువంటి చర్ల మండలంలో డిగ్రీ కాలేజీ లేక పోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారనీ, ఏజెన్సీ అభివృద్ధి కోసం విద్యార్థులకు పై చదువులు చదువుకోవడం కోసం డిగ్రీ కాలేజీ మంజూరు చేయాలని ప్రగతీ శీల యువజన సంఘం పి వై ఎల్,ప్రగతీ శీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం, పిడిఎస్ యు ఆధ్వర్యంలో, చర్ల మండల పర్యటనకు వచ్చిన జిల్లా కలెక్టర్ అంకిత్ కి వినతిపత్రం సమర్పించడం జరిగింది. అనంతరం పి వై ఎల్ ప్రగతిశీల యువజన సంఘం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఉపాధ్యక్షుడు కామ్రేడ్ ముసలి సతీష్ మాట్లాడుతూ, రాబోయే తరానికి కాబోయే భావి భారత పౌరులుగా, తీర్చిదిద్దాల్సిన విద్యార్థులు ఇంటర్మీడియట్ తోటే విద్య మధ్యలో ఆగిపోతుందని,ఈ ఏజెన్సీ ప్రాంతంలో డిగ్రీ కాలేజ్ ఉంటే చదువుకోడానికి అవకాశం ఉంటుందని,అలాగే దూర ప్రాంతాల నుండి వచ్చే విద్యార్థులకు ఉపయోగంగా ఉంటుందని వారు అన్నారు. చాలామంది విద్యార్థులు చర్లలో డిగ్రీ కాలేజీ లేకపోవడంతో భద్రాచలం, కొత్తగూడెం, ఖమ్మం, వరంగల్ లాంటి సుదిర ప్రాంతాలకు వెళ్లి చదువుకోవాల్సిన పరిస్థితి వచ్చింది అని వారు అన్నారు. ఈ విషయంపై మంత్రులను కలిసి రీప్రజంటేషన్స్ ఇచ్చిన,కలెక్టర్లను కలిసిన పట్టించుకోని పరిస్థితి, కావున ఇప్పుడున్న జిల్లా కలెక్టర్ అంకిత్ జోక్యం చేసుకొని చర్ల మండలంలో డిగ్రీ కాలేజ్ మంజూరు చేయాలని, అలాగే ఇంటర్మీడియట్ విద్యార్థులు పై చదువులు చదువుకునేందుకు కృషి చేయాలని వారు పిలుపునిచ్చారు. అనంతరం కలెక్టర్ ఈ సమస్య పరిష్కారం కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గొంది మూయన్న, సంతపూర్ సురేష్, ప్రసాద్, శ్రీను, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల ఇబ్బందులపై ఎస్పీ వెంటనే స్పందన

- దెబ్బతిన్న రహదారికి మరమ్మతులు.
- కొత్తపల్లి బ్రిడ్జి వద్ద రాకపోకలకు ఊరట.
- ఏళ్లుగా ఇబ్బందులు మెదక్ ఎస్పీ చొరవతో పరిష్కారం.

**ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 12 (జన సంఘర్షణ)**






మెదక్ జిల్లా పాపన్నపేటకు వెళ్లే మార్గంలోని కొత్తపల్లి బ్రిడ్జి వద్ద బ్రిడ్జి నిర్మాణం జరిగినప్పటి నుంచి రహదారి దెబ్బతినడంతో ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.వర్షాలు కురిసిన సమయంలో పరిస్థితి మరింత ఇబ్బందికరంగా మారడంతో వాహనదారులు, ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. ఈ సమస్యను గమనించిన మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు వెంటనే స్పందించారు. ప్రజలకు రాకపోకల్లో ఇబ్బందులు కలగకుండా రహదారిని బాగు చేయించాలని పాపన్నపేట ఎస్ఐ శ్రీనివాస్‌గౌడ్ ను ఆదేశించారు.ఎస్పీ ఆదేశాల మేరకు బ్రిడ్జి వద్ద దెబ్బతిన్న రహదారికి మరమ్మతులు చేపట్టి రాకపోకలకు అనుకూలంగా రోడ్డును ఏర్పాటు చేశారు.దీంతో చాలా కాలంగా ఇబ్బందులు పడుతున్న ప్రజలకు కొంత ఊరట లభించింది.సమస్యను గుర్తించి వెంటనే స్పందించి రహదారి మరమ్మతులు చేయించిన జిల్లా ఎస్పీకి స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

# మత్స్య కారులకు ప్రమాద భీమా 5 లక్షలు

- మంత్రి వాకిటి శ్రీహరి
- 60:40 నిస్పత్తి లో కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల ప్రీమియం

**హైదరాబాద్, ఆగస్టు 12(జనసంఘర్షణ):**



4.21 లక్షలకుపైగా నమోదిత మత్స్యకారులకు గ్రూప్ ప్రమాద బీమా.
2026-27 ఆర్థిక సంవత్సరానికి జి ఏ ఐ ఎస్ అమలుకు తెలంగాణ ప్రభుత్వం ఆమోదం.
4,21,767 మంది నమోదిత మత్స్యకారులకు బీమా రక్షణ.
18 నుంచి 70 ఏళ్ల వయస్సు గల మత్స్యకారులకు పథకం వర్తింపు.
ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.5 లక్షల బీమా.
శాశ్వత సంపూర్ణ వైకల్యానికి రూ.5 లక్షల పరిహారం.
శాశ్వత పాక్షిక వైకల్యానికి రూ.2.50 లక్షల బీమా.
ప్రమాదవశాత్తు ఆసుపత్రి చికిత్సకు రూ.25 వేల వరకు వైద్యసాయం.
ఒక్కో మత్స్యకారుడికి రూ.79.96 బీమా ప్రీమియం.
60:40 నిష్పత్తిలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రీమియం చెల్లింపు,
రాష్ట్ర ప్రభుత్వం వాటాగా రూ.21.34 కోట్లకుపైగా చెల్లింపు,
మత్స్యకారులపై ఎలాంటి ఆర్థిక భారం ఉండదు: మంత్రి వాకిటి శ్రీహరి.
జూన్ 1, 2026 నుంచి పాలసీ కాలం అమల్లోకి.
మత్స్యకారుల సామాజిక భద్రతకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత: మంత్రి.
ప్రమాద సమయంలో మత్స్యకారుల కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించడమే లక్ష్యం.
మత్స్యకారుల సంక్షేమంలో గ్రూప్ ప్రమాద బీమా కీలకం: వాకిటి శ్రీహరి తెలియ జెసారని చర్ల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు విజయ్ నాయుడు తెలియజేశారు.

# భారత కమ్యూనిస్టు పార్టీ జాతీయ సమితి ఆగస్టు 6 నుండి 14 వరకు ప్రజా చైతన్య యాత్ర

**మంచిర్యాల జిల్లా, బెల్లంపల్లి నియోజకవర్గం, ఆగస్టు 12(జనసంఘర్షణ):**

బెల్లంపల్లి పట్టణంలో పట్టణ కార్యదర్శి ఆడెపు రాజమౌళి అధ్యక్షతన భగత్ సింగ్ విగ్రహానికి, అమరజీవి మాజీ ఎమ్మెల్యే గుండా మల్లేష్ విగ్రహానికి పూలమాలలు వేసి పోరు యాత్రను ప్రారంభించి. ఈ సందర్భంగా రాష్ట్ర సిపిఐ కంట్రోల్ కమిషన్ కార్యదర్శి మిట్టపల్లి వెంకట స్వామి, బెల్లంపల్లి నియోజకవర్గ కార్యదర్శి దాగం మల్లేష్ మాట్లాడుతూ ఈ దేశంలో బిజెపి ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు భారత కమ్యూనిస్టు పార్టీ జాతీయ సమితి దేశమంతట ప్రజలను చైతన్యపరచుటకు ఈ కార్యక్రమం చేపట్టడం జరిగినది. సార్వత్రికవిద్య ప్రజల ఆరోగ్యం గురించి వైద్యం ప్రభుత్వమే నిర్వహించాలని యువకులకు ఉపాధి కల్పించాలని ధరల పెరుగుదల అరికట్టాలని పంటలకు కనీస మద్దతు ధర చట్టబద్ధత కల్పించాలని దళిత ఆదివాసీలపై ఆకృత్యాలను దాడులను నిలిపివేయాలని మహిళా రిజర్వేషన్లు తక్షణమే అమలు చేయాలని కార్మిక హక్కులను పరిరక్షించాలని బ్యాలెట్ పేపర్ పద్ధతిలో ఎన్నికలను పునరుద్ధరించి ప్రజాస్వామ్యాన్ని పరిక్షించాలని అలాగే బెల్లంపల్లి పట్టణంలో రోడ్డు విస్తరణలో ఉపాధి కోల్పోయిన వారికి వెంటనే వారికి ఉపాధి కల్పించాలని బెల్లంపల్లి పట్టణము చుట్టూ ఉన్న ఖాళీ భూములను రియల్ ఎస్టేట్ లు కబ్జా చేసి ప్లాట్లు వేసి అమ్ముకుంటున్నారు ప్రభుత్వ అధికారులు తక్షణమే స్పందించి వెంటనే ఆపాలని క్రమంగా మంచినీరు సరఫరా చేయాలని తెలియజేసినారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సమితి సభ్యులు రాలు బొల్లం పూర్ణిమ, జిల్లా కార్యవర్గ సభ్యులు చిప్ప నరసయ్య, బి కే యం యు జాతీయ సమితి సభ్యులు అక్కెపల్లి బాబు, బెల్లంపల్లి మండల కార్యదర్శి బొంతల లక్ష్మీనారాయణ తాండూరు మండల కార్యదర్శి కొల్లు బానేష్, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జాడి పోషశీ, బి కే యం యు జిల్లా కార్యదర్శి గుండా



చంద్రమాణిక్యం, జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు బొల్లం సోని, జిల్లా సమితి సభ్యులు డిఆర్ శ్రీధర్, బొల్లం తిలకంబెడ్కర్, రత్నం రాజం, మేకల రాజేశం, మంతెన రమేష్, ఫిట్ కార్యదర్శిలు రత్నం ప్రవీణ్ కుమార్, వడ్డె మల్ల రాజేందర్, లక్ష్మీనారాయణ, జిల్లా ప్రజానాట్యమండలి ఉపాధ్యక్షులు బొంకూర్ రామచందర్, నాయకులు జూపాక కొమురయ్య, బండారు శంకర్, అందుగుల రాజేందర్, స్వామి దాసు, కే తిరుపతి, చంద్రయ్య, నర్సింగ్, గుండా శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# అశ్వారావుపేటలో ఘనంగా ప్రజా చైతన్య యాత్రల ముగింపు సభ

- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలపై పోరు
- రైతు, కార్మిక వ్యతిరేక నిర్ణయాలు వీడాలి
- నీట్ పరీక్ష లీకేజీపై విచారణ చేపట్టాలి
- పంటలకు కనీస మద్దతు ధర చట్టం తెవాలి
- రామాలయం నిధుల దుర్వినియోగంపై సమాధానం చెప్పాలి
- ఎన్నికల హామీలను కాంగ్రెస్ నెరవేర్చాలి
- నాలుగు లేబర్ కోడ్లను వెంటనే రద్దు చేయాలి
- ప్రజా పోరాటాలతోనే మార్పు సాధ్యం
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు భాగం హేమంతరావు
- కామ్రేడ్ సయ్యద్ మీయాజాని, వారి కుటుంబం అశ్వరావుపేట నియోజకవర్గం కోసం చేసిన నిస్వార్థ సేవ,కృషి వెలకట్టలేనిది
- సిపిఐ అశ్వరావుపేట నియోజకవర్గం కార్యదర్శి సయ్యద్ సలీం అధ్యక్షతన ప్రజా చైతన్య ముగింపు సభ







**12-8-2026 జన సంఘర్షణ**

ఏడోళ్ల బయ్యారంలో ఆగస్టు 6 న మొదలైన ఈరోజు అశ్వరావుపేట లో ముగింపు సభ అంగరంగ వైభవంగా సిపిఐ జాతీయ సభ సభ్యులు రజబ్ అలీ భవన్ వద్ద పార్టీ అరుణ పతాకాన్ని ఆవిష్కరించి ముగింపు సభను మొదలుపెట్టారు. అశ్వరావుపేట రింగ్ రోడ్ సెంటర్లోని సయ్యద్ మీయాజాని కోపం వద్ద జిల్లా కార్యదర్శి షేక్ షాబిర్ పాషా అరుణ పతాకాన్ని ఆవిష్కరించారు, కొత్తగూడెం మేయర్ గణేష్ గారు పూలమాల వేసి నివాళులు అర్పించారు. అదేవిధంగా సయ్యద్ మీయాజాని గారు అశ్వరావుపేట నియోజకవర్గం లో సిపిఐ పార్టీ కోసం చేసిన నిస్వార్ధ సేవను,కృషిని కొనియాడారు.ే కంద్రంలో అధికారంలో ఉన్న నరేంద్ర మోడీ ప్రభుత్వ రైతు, కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ, అలాగే రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ సీపీఐ చేపట్టిన ప్రజా చైతన్య యాత్రల ముగింపు బహిరంగ సభ బుధవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వరావుపేటలో ఘనంగా జరిగింది. సందర్భంగా అశ్వరావుపేట యాత్రకు పార్టీ నాయకులు కార్యకర్తలు అన్ని వర్గాల ప్రజలు ఘనంగా స్వాగతం పలికారు, అక్కడినుంచి పట్టణంలోని ప్రధాన సెంటర్ల మీదుగా భారీ ప్రదర్శన నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు భాగం హేమంతరావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం గత 12 ఏళ్లుగా ప్రజలు, రైతులు, కార్మికులు, యువత ఎదుర్కొంటున్న సమస్యలను పట్టించుకోవడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. పార్లమెంట్ సమావేశాల్లో ప్రజా సమస్యలపై చర్చించకుండా పక్కదారి పట్టిస్తున్నారని మండిపడ్డారు. దేశంలో పెరిగిన నిత్యావసరాల ధరలు, గ్యాస్, పెట్రోల్ ధరలను అదుపు చేయడంలో నిరుత్సాహపరిచారని అన్నారు. ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి, ఒక్క ఉద్యోగం ఇవ్వకపోగా ప్రభుత్వ రంగాన్ని కార్పొరేట్లకు కట్టబెడుతున్నారని ధ్వజమెత్తారు. నీట్ ప్రవేశ పరీక్ష లీకేజీ కారణంగా పలువురు విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకున్నారని, దీనికి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రైతుల ఆదాయం రెట్టింపు చేస్తామని చెప్పిన మోడీ ప్రభుత్వం కనీస మద్దతు ధర (ఎంఎస్పీ) గ్యారెంటీ చట్టాన్ని ఇప్పటికీ తేలేదని, విదేశీ వాణిజ్య ఒప్పందాలతో వ్యవసాయ రంగాన్ని దెబ్బతీస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్మికులు పోరాడి సాధించుకున్న 44 చట్టాలను రద్దు చేసి, 4 లేబర్ కోడ్లను తీసుకువచ్చి కార్మిక హక్కులను కాలరాస్తున్నారని విమర్శించారు. అలాగే రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నర సంవత్సరాలు గడుస్తున్నా ఆరు గ్యారెంటీలు, ఇతర ఎన్నికల హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయడంలో అలసత్వం వహిస్తోందని భాగం హేమంతరావు పేర్కొన్నారు. అనంతరం సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాష మాట్లాడుతూ పాత పింఛన్లు, మహాలక్ష్మి పథకం, రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు వంటి హామీల కోసం ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరుగుతూ పదేపదే దరఖాస్తులు చేసుకునే పరిస్థితి వచ్చిందన్నారు. అశ్వరావుపేటలో రాష్ట్రంలో ఇతర ప్రాంతాలలో పేదల ఇళ్లను, గుడిసెలను తొలగించడం సరికాదని, ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసే కుట్రలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. రైతాంగం, కార్మికులు, ప్రజల హక్కుల పరిరక్షణ కోసం ప్రజా పోరాటాలను తీవ్రతరం చేయడమే మార్గమని స్పష్టం చేశారు. అనంతరం సిపిఐ అశ్వరావుపేట నియోజకవర్గ కార్యదర్శి సయ్యద్ సలీం మాట్లాడుతూ: అశ్వరావుపేట నియోజకవర్గం లో అదేవిధంగా అశ్వరావుపేట పట్టణంలో అనేక సమస్యలు ఉన్నాయని. అశ్వరావుపేట పరిసర ప్రాంతాల్లో భూస్వాముల ఆధీనంలో ఉన్న వందల ఎకరాల భూముల లెక్కలు తేల్చాలని, అదేవిధంగా సర్వేనెంబర్ 1228లో నిర్దాక్షిణ్యంగా కూల్చేసిన పేదల ఇళ్లకు ప్రభుత్వం సమాధానం చెప్పాలని వారికి స్థలం ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాథం కల్లూరి వెంకటేశ్వర్లు మేయర్ మూడ్ గణేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు సరిరెడ్డి పుల్లారెడ్డి, సిపిఐ అశ్వరావుపేట మండల రాంబాబు ఇంచార్జ్ రామకృష్ణ, మండల కార్యదర్శి అర్జున్ రావు,సిపిఐ అశ్వరావుపేట పట్టణ కార్యదర్శి నూకవరపు విజయ్ కాంత్,మున్నా లక్ష్మీ కుమారి, నరాటి ప్రసాద్, చంద్ర నరేంద్ర కుమార్, చంద్రగిరి శ్రీనివాసరావు, అబ్బాస్, చెన్నారావు, జలాల్, అనిల్, ముత్తు, సత్యవతి, శ్రావణి, రోహిణి, పోసి, మున్నా,రాజు,నాగేశ్వరరావు,సలిగంటి శ్రీనివాస్, కంచర్ల జమాలయ్య, వీసంశెట్టి పూర్ణచంద్రరావు ఉప్పుశెట్టి రాహుల్, మువ్వా వెంకటేశ్వర్లు,కందుల భాస్కర్, ూఖ ఫహీం, ప్రజాసంఘాల జిల్లా బాధ్యులు భూక్యా శ్రీనివాస్, వరక అజిత్, వేము కొండల రావు,నిమ్మల రాంబాబు, రత్నకుమారి, కార్పొరేటర్లు, సర్పంచులు, ఉపసర్పంచులు ప్రజాసంఘాల నాయకులు, సిపిఐ అశ్వరావుపేట కార్యకర్తలు నాయకులు తదితరులు పాల్గొన్నారు.



Printed, published and owned by **Rachamallu Madhavi** Printed at **Kranthi Printing Press**, 42/603/1/1-a, Mj Colony, Street no 5, Mjcolony, Moulali Secundrabad, and Published from h.no: 10-10-117/150, Nayi brahmana colony. Neerugonda Hanuman road, Nagaram Nizamabad (m&d) 503001, Telangana, Editor : **Rachamallu Madhavi**. **RNI Reg No :tel/2024/89323,** Cell 6305026524, Email:janasangarshana@gmail.co